www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 12 | బుధవారం | 12 ఆగస్టు, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169



# మృత్యుఘోష!

- సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదాలు
- జహీరాబాద్‌లో ఆటోను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్
- ఏడుగురు కూలీలు దుర్మరణం..
- ఐదుగురికి తీవ్రగాయాలు
- మృతులు కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరి గ్రామానికి చెందిన వారుగా గుర్తింపు
- కోహీర్‌లో అదుపుతప్పిన కారు.. ఇద్దరు మృతి

2

సంగారెడ్డి జిల్లాలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు మృత్యుఘోషను మోగించాయి. జహీరాబాద్, కోహీర్ మండలాల పరిధిలో చోటుచేసుకున్న ఈ ప్రమాదాల్లో మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలతో ఆయా ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యవసాయ కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కోహీర్ మండలం వెంకటాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన మరో ప్రమాదంలో కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. అనంతరం అవతలి వైపునకు దూసుకెళ్లడంతో ఎదురుగా వస్తున్న నాలుగు వాహనాలను వరుసగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు.



# రాహుల్.. హైదరాబాద్‌కు రండి!

- 'ఛాత్రోంకీ గూంజ్' నిర్వహించి విద్యార్థులకు సమాధానం చెప్పండి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?
- రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?
- రూ.12వేల కోట్ల బకాయిలతో విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిచిపోతున్నాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

2

## పాతబస్తీ మెట్రో పనుల్లో

# వేగం పెంచండి

### 7.5 కి.మీ. రోడ్డు విస్తరణ త్వరగా పూర్తిచేయాలి

- టెండర్లు, భూసేకరణ ప్రక్రియ వీలైనంత తర్వగా ప్రారంభించాలి
- ఎంజీబీఎస్– చాంద్రాయణగుట్ట కారిడార్‌పై సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మెట్రో రైలు ఫేజ్–2లో భాగంగా ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట కారిడార్ పనులపై మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణను త్వరగా పూర్తి చేసి, మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. కారిడార్‌కు సంబంధించిన 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రోలో పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లను సమకూర్చుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఢిల్లీ మెట్రో అధికారుల సలహాలు తీసుకోవాలని చెప్పారు.

### పెట్టుబడులే లక్ష్యంగా గ్లోబల్ సమ్మిట్

డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గత సమ్మిట్‌లో కుదిరిన పెట్టుబడి ఒప్పందాలు, వాటి పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా కొత్త కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సదస్సు నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని చెప్పారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సదస్సులో సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడుల పురోగతిపై పూర్తి వివరాలను సిద్ధం చేసి, భవిష్యత్‌లో మరింత పెట్టుబడులు సాధించే దిశగా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు.



## 'ఖేలో ఇండియా'కు సర్వసన్నద్ధం

2

- 20 క్రీడాంశాలకు వేదికల గుర్తింపు.. మౌలిక వసతుల అభివృద్ధి
- హైదరాబాద్ స్టేడియాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి
- ప్రారంభ, ముగింపు వేడుకలు ఘనంగా ఉండాలి: సీఎం రేవంత్

## పేద పిల్లల కలలకు 'యంగ్ ఇండియా' పాఠశాలలు

2

- ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం
- సీఎం రేవంత్‌రెడ్డి



# మంగళ్ మిలన్

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ వారాంత సమావేశం 'మంగళ్ మిలన్' మంగళవారం ఉత్సాహంగా జరిగింది. పార్లమెంట్ ప్రాంగణంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. మోదీ సమావేశ మందిరంలోకి ప్రవేశించగానే ఎన్డీయే ఎంపీలు, కేంద్ర మంత్రులు త్రివర్ణ పతాకాలు చేతబట్టి 'వందే మాతరం', 'భారత్ మాతా కీ జై' అంటూ నినాదాలు చేశారు. మోదీ సైతం జాతీయ పతాకాన్ని చేతబట్టి సభ్యులకు అభివాదం చేశారు. సమావేశంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆ శాఖ చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు.




# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' రేషన్‌కార్డులు

- ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి పంపిణీ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు
- అర్హులందరికీ నెలకు 6 కిలోల సన్నబియ్యం ఉచితం
- పారదర్శకత, సామర్థ్యం, లబ్ధిదారుల సౌలభ్యమే లక్ష్యం
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

2

తెలంగాణలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చే దిశగా ప్రభుత్వం మరో అడుగు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న శ్రీకారం చుట్టనుంది. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లోనూ ఏకకాలంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.




## 'షెల్ కంపెనీల' చాటున భూ కేటాయింపులు

- సీఎం సోదరుల బాగోతం బయటపెడతాం
- టెస్రాక్ట్ సంస్థతో కొండల్‌రెడ్డి సంబంధాలపై స్పష్టతనివ్వాలని
- భూ కేటాయింపులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం
- మాజీ మంత్రి కేటీఆర్

2

## నిషేధిత భూములపై ఆందోళన వద్దు

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
- జాబితాలో కొత్తగా భూములేవీ చేర్చలేదు
- సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2



# ఇక ప్లాస్టిక్ కరెన్సీ

- రూ.10, రూ.20 నోట్లపై కేంద్రం కీలక నిర్ణయం
- ఫీల్డ్ ట్రయల్స్ కోసం 100 కోట్ల నోట్ల జారీకి అనుమతి
- విజయవంతమైతే సాధారణ చలామణిలోకి
- ఇంకా ప్రారంభ దశలోనే కొనుగోలు ప్రక్రియ
- రాజ్యసభలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

2



# మృత్యుఘోష!

- సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదాలు
- జహీరాబాద్‌లో ఆటోను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్
- ఏడుగురు కూలీలు దుర్మరణం.. ఐదుగురికి తీవ్రగాయాలు
- మృతులు కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరి గ్రామానికి చెందిన వారుగా గుర్తింపు
- కోహీర్‌లో అదుపుతప్పిన కారు.. ఇద్దరు మృతి

ప్రజానావ, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు మృత్యుఘోషను మోగించాయి. జహీరాబాద్, కోహీర్ మండలాల పరిధిలో చోటుచేసుకున్న ఈ ప్రమాదాల్లో మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలతో ఆయా ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యవసాయ కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతులు, క్షతగాత్రులు కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు. పొలం పనుల కోసం సరిహద్దు రాష్ట్రం నుంచి వచ్చిన కూలీలు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడంతో రాజగిరి గ్రామంలో విషాదం నెలకొంది.

### బీభత్సం సృష్టించిన కారు

కోహీర్ మండలం వెంకటాపూర్ క్రాస్‌రోడ్డు సమీపంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై మరో ఘోర ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. అనంతరం అవతలి వైపునకు దూసుకెళ్లిన కారు.. ఎదురుగా వస్తున్న నాలుగు వాహనాలను వరుసగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రహదారి భద్రతా సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలను రహదారి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రెండు ప్రమాదాలపైనా వేర్వేరుగా కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమికంగా అతివేగం, అజాగ్రత్త కారణంగానే ఈ ప్రమాదాలు జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

# ఖేలో ఇండియాకు సర్వసన్నద్ధం

- డిసెంబరులో ప్రతిష్టాత్మక క్రీడా సంబరం
- 20 క్రీడాంశాలకు వేదికల గుర్తింపు.. మౌలిక వసతుల అభివృద్ధి
- హైదరాబాద్ స్టేడియాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలి
- ప్రారంభ, ముగింపు వేడుకలు ఘనంగా ఉండాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్య మంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబరులో జరగనున్న ఈ క్రీడా సంబరానికి ఇప్పటి నుంచే పకడ్బందీగా ఏర్పాట్లు ప్రారంభించాలని సూచించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీలకు అవసరమైన మౌలిక వసతులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌లోని స్టేడియాల ప్రస్తుత పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, క్రీడా పోటీలకు అనువుగా వాటిని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

### ముందుగానే వేదికలు గుర్తించాలి

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో 20 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్న నేపథ్యంలో.. క్రీడాంశాల వారీగా వేదికలను ముందుగానే గుర్తించాలని సీఎం ఆదేశించారు. ప్రతి వేదిక వద్ద అవసరమైన మౌలిక వసతులు, క్రీడా పరికరాలు, పోటీ నిర్వహణ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, అతిథులకు అవసరమైన వసతుల కల్పనకు శాఖల వారీగా స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలని చెప్పారు.

### ప్రముఖుల ఆధ్వర్యంలో వేడుకలు

క్రీడా పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళిక రూపొందించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ముఖ్య అతిథులు, ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను కార్యక్రమాల్లో భాగస్వాములను చేసే అంశంపై కసరత్తు ప్రారంభించాలని ఆదేశించారు. తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులతోపాటు జాతీయ స్థాయి క్రీడా ప్రతినిధులను వేడుకల్లో భాగస్వాములను చేయాలని సూచించారు.

### క్రీడా స్ఫూర్తి చాటేలా..

తెలంగాణ ఆతిథ్యాన్ని దేశవ్యాప్తంగా చాటేలా, క్రీడా స్ఫూర్తి ప్రతిబింబించే విధంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు, ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన వసతులు కల్పించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ఎ. సోనీబాల దేవి తదితరులు పాల్గొన్నారు.

## పేద పిల్లల కలలకు 'యంగ్ ఇండియా' పాఠశాలలు

తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. భవనాలు నిర్మించడం సులభమే అయినా.. విద్యార్థుల కలలకు బలమైన పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం అవసరమన్నారు. ఆ సంకల్పంతోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం వంటి భేదాలకు అతీతంగా ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ విద్యాలయాలు పేద కుటుంబాల పిల్లలను భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, పరిపాలకులు, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. పేద పిల్లల కలలకు చిరునామాగా, తెలంగాణ అభివృద్ధి నమూనాకు ప్రతీకగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిలుస్తాయని సీఎం పేర్కొన్నారు. ఇవి భవిష్యత్ తరాల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురానున్నాయని తెలిపారు.

## నీట్ రద్దుకు తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

- 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్య ప్రవేశాలు కల్పించాలని డిమాండ్
- వ్యతిరేకించిన బీజేపీ ఎమ్మెల్యే బోజరాజన్ వాకౌట్

చెన్నై: నీట్ పరీక్షను రద్దు చేసి, 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేలా కేంద్ర చట్టాల్లో మార్పులు చేయాలని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ మంగళవారం తీర్మానం ఆమోదించింది. ఆరోగ్యశాఖ మంత్రి కె.జి. అరుణ్‌రాజ్ ప్రవేశపెట్టిన తీర్మానానికి పలు పార్టీలు మద్దతు ఇవ్వగా.. బీజేపీ ఏకైక ఎమ్మెల్యే బోజరాజన్ వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. నీట్ సామాజిక న్యాయం, సమానత్వానికి విరుద్ధంగా ఉందని, తమిళ మాధ్యమ, గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రతికూలంగా మారిందని ప్రభుత్వం పేర్కొంది. ఖరీదైన కోచింగ్ కేంద్రాలపై ఆధారపడాల్సి వస్తోందని, ప్రశ్నపత్రాల లీకేజీలు, అవకతవకలు, పరీక్ష రద్దు, పునఃపరీక్షలతో విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని తెలిపింది.

### ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లుపై వ్యతిరేకత

విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణ బిల్లు–2026ను ప్రస్తుత రూపంలో ఉపసంహరించుకోవాలని కోరుతూ మరో తీర్మానాన్ని సభ ఆమోదించింది. బిల్లుతో మైనారిటీలు నిర్వహించే విద్యా, సామాజిక సంక్షేమ సంస్థల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగే అవకాశం ఉందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.

# రాహుల్.. హైదరాబాద్‌కు రండి

- 'ఛాత్రోంకీ గూంజ్' నిర్వహించి విద్యార్థులకు సమాధానం చెప్పండి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?
- రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?
- రూ.12 వేల కోట్ల బకాయిలతో విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిచిపోతున్నాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



ప్రజానావ, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హైదరాబాద్‌లో 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రంలోని విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల హామీపై విద్యార్థుల సమక్షంలో రాహుల్ స్పష్టత ఇవ్వాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర విమర్శలు చేశారు.

### అశోక్‌నగర్‌లోనే కార్యక్రమం పెట్టండి

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అశోక్‌నగర్ కేంద్రంగా ఉందని రామచందర్‌రావు తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌కు వచ్చి విద్యార్థులతో మాట్లాడిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు మరోసారి అక్కడే 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని సూచించారు. ఉద్యోగ క్యాలెండర్ ఏమైంది? రెండు లక్షల ఉద్యోగాల హామీ ఎక్కడ? ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సంగతేంటి? అంటూ రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయినా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ హామీ అమలు కాలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రామచందర్‌రావు ఆరోపించారు. బకాయిలు పేరుకుపోవడంతో విద్యాసంస్థలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

### పార్లమెంట్‌కు రాహుల్ ఎందుకు దూరం?

జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనపై పార్లమెంట్‌లో చర్చకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ రాహుల్‌గాంధీ పార్లమెంట్‌కు దూరంగా ఉంటున్నారని రామచందర్‌రావు ఆరోపించారు. తొలుత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసిందని, ఆ డిమాండ్ మేరకు రాజీనామా కూడా ఆమోదించబడిందని తెలిపారు. అనంతరం అమిత్‌షా ప్రకటన చేయాలని రాహుల్ కోరారని, కేంద్రం అందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు.

### విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలా?

జార్ఖండ్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును రామచందర్‌రావు ఖండించారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌కు దూరంగా ఉండడం వెనుక తన వైఫల్యాలు బయటపడతాయన్న భయమే కారణమని విమర్శించారు.

# ఇక ప్లాస్టిక్ కరెన్సీ

- రూ.10, రూ.20 నోట్లపై కేంద్రం కీలక నిర్ణయం
- విజయవంతమైతే సాధారణ చలామణిలోకి

న్యూఢిల్లీ: దేశంలో రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఫీల్డ్ ట్రయల్స్ కోసం ఈ రెండు విలువలలో చెరో 100 కోట్ల పాలిమర్ నోట్లను తీసుకురావడానికి అనుమతించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం రాజ్యసభకు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ప్రయోగాత్మకంగా నిర్వహించే పరీక్షలు విజయవంతమైతే పాలిమర్ నోట్లను క్రమం తప్పకుండా జారీ చేసే అవకాశం ఉందని వెల్లడించారు. ఆర్‌బీఐ కేంద్ర బోర్డు సిఫారసు మేరకు రూ.10, రూ.20 విలువల్లో చెరో 100 కోట్ల పాలిమర్ నోట్లను ఫీల్డ్ ట్రయల్స్ కోసం జారీ చేయాలని కేంద్రానికి ప్రతిపాదన పంపింది. ఆర్‌బీఐ చట్టం–1934లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపాదనను పంపినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లతోపాటు పాలిమర్ నోట్లను కూడా జారీ చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. పాలిమర్ నోట్ల కొనుగోలు ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని మంత్రి తెలిపారు. అందువల్ల ఇవి ఎప్పటి నుంచి చలామణిలోకి వస్తాయి? ఎంత వ్యయం అవుతుంది? అనే విషయాలను ప్రస్తుతానికి కచ్చితంగా చెప్పలేమన్నారు.

### తగ్గిన ద్రవ్యోల్బణం

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. సీపీఐ ఆధారిత సగటు ద్రవ్యోల్బణం 2023–24లో 5.4 శాతం నుంచి 2024–25లో 4.6 శాతానికి, 2025–26లో 2.1 శాతానికి తగ్గిందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం, అంతర్జాతీయ ఇంధన ధరలు, కూరగాయల ధరల పెరుగుదల వంటి కారణాలతో 2026–27 తొలి త్రైమాసికంలో 3.9 శాతానికి పెరిగినా.. ఆర్‌బీఐ నిర్దేశించిన 4 శాతం లక్ష్యం కంటే తక్కువగానే ఉందని తెలిపారు. 56వ జీఎస్టీ మండలి సమావేశంలో రెండు ప్రధాన పన్ను రేట్లతోపాటు ప్రత్యేక డీమెరిట్ రేటును నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. సాధారణ రేటు 18 శాతం, మెరిట్ రేటు 5 శాతం, ఎంపిక చేసిన వస్తువులు, సేవలకు 40 శాతం ప్రత్యేక డీమెరిట్ రేటు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పలు వస్తువులు, సేవలపై జీఎస్టీ రేట్లు 28 నుంచి 18 శాతానికి, 18 నుంచి 12 లేదా 5 శాతానికి, 12 నుంచి 5 లేదా సున్నా శాతానికి తగ్గాయని తెలిపారు. వ్యక్తుల చేతిలో అందుబాటులో ఉండే ఆదాయాన్ని పెంచేందుకు వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు కల్పించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. జీతభత్యాలు పొందేవారికి ప్రామాణిక మినహాయింపుతో ఈ పరిమితి రూ.12.75 లక్షలకు చేరుతుందని పేర్కొన్నారు. దేశీయ వినియోగానికి ఈ చర్యలు మద్దతుగా నిలిచాయని తెలిపారు. 2025–26లో తలసరి ప్రైవేట్ తుది వినియోగ వ్యయం 6.8 శాతం వృద్ధి సాధించిందని, 2023–24లో నమోదైన 4.8 శాతంతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని వెల్లడించారు.

# నిషేధిత భూములపై ఆందోళన వద్దు

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
- జాబితాలో కొత్తగా భూములేవీ చేర్చలేదు
- సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి
- 14లోగా భూ సంబంధిత జీవోలు, ఉత్తర్వులు, పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజానావ, హైదరాబాద్: నిషేధిత ఆస్తుల పీఓబీ/22ఎ జాబితాలో ఉన్న భూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం కొత్తగా ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కల్పిస్తామని తెలిపారు. మంగళవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 22ఎకు సంబంధించి ప్రజావాణి, కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే–అవుట్ అనుమతులు తదితర అన్ని పత్రాలను ఈ నెల 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల నకిలీ పత్రాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్లకు స్పష్టత వస్తుందని చెప్పారు. ఏది అసలైన పత్రమో.. ఏది నకిలీదో పరిశీలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహాణీలను సబ్ రిజిస్ట్రార్లకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### దరఖాస్తులపై వేగంగా నిర్ణయాలు

వచ్చిన దరఖాస్తుల్లో ఏవి చట్టబద్ధమైనవో.. ఏవి కాదో యుద్ధప్రాతిపదికన తేల్చాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కంటే.. సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదేనన్నారు. పీఓబీ దరఖాస్తులను అధికారులు ప్రతిరోజూ సమీక్షించాలని ఆదేశించారు. 22ఎ పేరుతో ఉద్దేశపూర్వకంగా పేదలు, అర్హులకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తే సహించబోమని పొంగులేటి హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చిన్న తప్పిదానికైనా కఠిన చర్యలు తప్పవన్నారు.

### సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కళ్లెం

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు లేవని, అదనపు అధికారాలు ఇవ్వొద్దని గతంలోనే స్పష్టత ఇచ్చామని చెప్పారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగానే నిర్ణయాలు తీసుకునేలా వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశించారు. పీఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించవద్దని మంత్రి సూచించారు. తిరస్కరించాల్సిన పరిస్థితి ఉంటే మూడు రోజుల సమయం తీసుకుని అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా సబ్ రిజిస్ట్రార్లు కలెక్టర్ లేదా ఐజీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పీఓబీకి సంబంధించిన ప్రతి దరఖాస్తును ఇకపై తహసీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కు పంపాలని ఆదేశించారు. కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ మధ్యే సంబంధిత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేలా చూడాలన్నారు.

### సమగ్ర సమాచారం

గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవని మంత్రి తెలిపారు. వీటిని సమీకరించిన తర్వాత కొన్ని ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపించడంతో రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. తాజాగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో వివరాలను సరిపోల్చి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉన్నతస్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి వివరించి, వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీని మంత్రి ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

## 3.43 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు

- ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి పంపిణీ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- పౌర రఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చే దిశగా ప్రభుత్వం మరో అడుగు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న శ్రీకారం చుట్టనుంది. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లోనూ ఏకకాలంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారని మంత్రి వెల్లడించారు. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం పెరగడంతోపాటు లబ్ధిదారులకు మరింత సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటివరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులు జారీ చేసి, వాటి ద్వారా 61,08,544 మందికి ఆహార భద్రత కల్పించినట్లు తెలిపారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. ఆహార భద్రత కార్యక్రమం అమలుకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్ధిదారుల చెంతకు చేర్చడమే స్మార్ట్ రేషన్ కార్డుల లక్ష్యమన్నారు.

## షెల్ కంపెనీల చాటున భూ కేటాయింపులు

- సీఎం సోదరుల బాగోతం బయటపెడతాం
- టెస్రాక్ట్ సంస్థతో కొండల్‌రెడ్డి సంబంధాలపై స్పష్టతనివ్వాలని
- భూ కేటాయింపులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




ప్రజానావ, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం విలువైన భూములను కేటాయించిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారకరామారావు (కేటీఆర్) ఆరోపించారు. సీఎం సోదరులు చిన్నచిన్న చిరునామాలతో కంపెనీలు ఏర్పాటు చేసి, వాటికి ప్రభుత్వ భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ఉన్న వాస్తవాలను త్వరలో బయటపెడతామని హెచ్చరించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా పేర్కొన్నారని కేటీఆర్ తెలిపారు. ఆ సంస్థలో ఒక్క ఉద్యోగి కూడా లేకపోయినా.. పెద్ద మొత్తంలో భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ఆ సంస్థకు కేటాయించారంటూ ఆరోపించారు. కొండల్‌రెడ్డికి టెస్రాక్ట్‌తో సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారని, అదే నిజమైతే ఆయన సంస్థకు చైర్మన్‌గా తనను తాను ఎందుకు పేర్కొన్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల కేటాయింపులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేస్తున్నారని, సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు.

### గవర్నర్‌కు ఫిర్యాదు

భూకేటాయింపులు, కుటుంబ సభ్యుల పాత్రపై రాష్ట్ర గవర్నర్‌ను కలిసి విచారణకు కోరుతామని కేటీఆర్ తెలిపారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు హాజరవుతున్నారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు అందజేసే కార్యక్రమాల్లో ఆయన పాల్గొనడంపైనా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### 74 లక్షల ఓట్ల తొలగింపుపై ఆందోళన

రాష్ట్రంలో 74 లక్షల ఓట్లు తొలగించే అవకాశం ఉందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని కేటీఆర్ అన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తారని చెప్పారు. అర్హులైన ఓటర్ల హక్కు కోల్పోకుండా బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు.

### జీఆర్ఎంబీ భేటీపై స్పష్టత ఇవ్వాలి

తెలంగాణకు అన్యాయం చేసే నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించకూడదని కేటీఆర్ అన్నారు. జీఆర్ఎంబీ సమావేశంలో తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటే జలసౌధను ముట్టడిస్తామని హెచ్చరించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రం స్పష్టం చేసినప్పటికీ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడంలో తప్పు లేదని, అయితే ప్రభుత్వం చేయాల్సిన పనులను కూడా సమర్థంగా చేపట్టాలని కేటీఆర్ సూచించారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే

- ఆగస్టు 18 నుంచి కొత్త ట్రాఫిక్ విధానం
- హెచ్–సీఐటీఐ పనులతో రద్దీ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసుల చర్యలు

ప్రజానావ, ఖైరతాబాద్ : నగరంలోని కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) పార్క్ పరిసరాల్లో ఆగస్టు 18, 2026 నుంచి వన్‌వే ట్రాఫిక్ విధానం అమల్లోకి రానుంది. హెచ్–సీఐటీఐ ప్రాజెక్టులో భాగంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో రోడ్లపై వాహనాల రద్దీని నియంత్రించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే వన్‌వే ట్రాఫిక్ విధానంపై ప్రయోగాత్మకంగా ట్రయల్స్ నిర్వహించిన అధికారులు ట్రాఫిక్ ప్రవాహం, జంక్షన్ల వద్ద రద్దీ, లేన్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ అనుభవాల ఆధారంగా తుది ట్రాఫిక్ నిర్వహణ ప్రణాళికను అమలు చేయనున్నారు.




### లేన్ మార్కింగ్‌లు.. దిశానిర్దేశ బోర్డులు

వాహనదారులకు కొత్త ట్రాఫిక్ మార్గాలు స్పష్టంగా తెలిసేలా లేన్ మార్కింగ్‌లు, దిశానిర్దేశ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీటీవీ కెమెరాలతో పాటు డ్రోన్‌లను కూడా వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

### వాహనదారులకు పోలీసుల సూచనలు

ఆగస్టు 18 నుంచి మారనున్న ట్రాఫిక్ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్, అనధికారిక పార్కింగ్‌కు దూరంగా ఉండాలని, రోడ్లపై ఏర్పాటు చేసే సూచిక బోర్డులు, ట్రాఫిక్ సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అత్యవసర సేవల వాహనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్ నిర్వహణలో ప్రత్యేక చర్యలు తీసుకోనున్నా రు. ట్రాఫిక్ మార్పులకు సంబంధించిన ధృవీకరించని సమాచారాన్ని సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేయవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.

### ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ వాహనదారులకు కీలకం

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో మారనున్న ట్రాఫిక్ విధానం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, పంజాగుట్ట తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో వాహనదారులు కొత్త మార్గాలను ముందుగానే తెలుసుకుని ప్రయాణాలు చేయడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

# ఆదివాసీలకు అండగా నిలవాలి

- పౌష్టికాహారం, రక్షిత మంచినీటితోపాటు హక్కుల భూములు అందించాలి
- అడ, ఎన్టీఆర్ సాగర్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు
- కెరమెరి–జోడేఘాట్ డబుల్ రోడ్డును వేగంగా పూర్తి చేయాలి: కల్వకుంట్ల కవిత



ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలకు పౌష్టికాహారం, రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివాసీల సంక్షేమం, హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె కోరారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఆదివాసీ నాయకులు, తెలంగాణ ఆదివాసీ టైగర్ సేన నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్ వర్ధంతి నాటికి కెరమెరి నుంచి జోడేఘాట్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అడ ప్రాజెక్టు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల కాల్వలను ఆధునీకరించి వాటి కింద ఉన్న మొత్తం 60 వేల ఎకరాల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివాసీలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న పోడు భూముల సమస్యను పరిష్కరించడంతోపాటు గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన హక్కు పత్రాలకు సంబంధించిన భూములను వెంటనే లబ్ధిదారులైన ఆదివాసీలకు అప్పగించాలని సూచించారు. ఇందుకోసం అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలు నామమాత్రంగా మారిపోవడం దురదృష్టకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ నాయకుడు సోయం బోజారావు గుట్టబండపై మట్టి పోసి పంటలు సాగు చేయడం వారి దుర్భర పరిస్థితులకు అద్దం పడుతోందన్నారు. ఆదివాసీల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు త్వరలోనే ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తామని, వారికి ఎల్లవేళలా తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని కవిత హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన కోట్నక కిషన్ రావు, పెందోర్ ధర్మ, పెందోర్ దౌలత్ రావు తదితరులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్దన్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కావేటి సబిత తదితరులు పాల్గొన్నారు.



## హర్ ఘర్ తిరంగా జాతీయ పతాకావిష్కరణ

ప్రజానావ, ఖైరతాబాద్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తన నివాసంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. దేశ ఐక్యత, సమైక్యతా స్ఫూర్తిని చాటుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శిరీష, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈడీ సవరణతో ఎంఎస్ఎంఈలకు ప్రయోజనం

- జిల్లా పరిశ్రమల మేనేజర్ ఏ. కీర్తి కాంత్
- సకాలంలో చెల్లింపులు, వేగవంతమైన వివాదాల పరిష్కారానికి అవకాశం
- ఎంఎస్ఎంఈలు ప్రభుత్వ నిబంధనలు, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజానావ, పెద్దపల్లి : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం, సకాలంలో చెల్లింపులు పొందేలా చేయడం, వ్యాపార వివాదాలను వేగంగా పరిష్కరించడం, పరిశ్రమల అభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని కల్పించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం ఎంఎస్ఎంఈడీ సవరణ బిల్లు–2026 ను ప్రవేశపెట్టిందని జిల్లా పరిశ్రమల మేనేజర్ ఏ. కీర్తి కాంత్ మంగళవారం తెలిపారు. ఎంఎస్ఎంఈడీ సవరణ బిల్లు 2026 ద్వారా సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు పలు ముఖ్యమైన ప్రయోజనాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పెట్టుబడి, వార్షిక వ్యాపార లావాదేవీల ఆధారంగా పరిశ్రమల వర్గీకరణతో పాటు, ఉద్యమ్ నమోదు ను ఉచితంగా, స్వచ్ఛందంగా ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలుదారుల నుంచి చెల్లింపులు ఆలస్యం అయినప్పుడు తలెత్తే వివాదాలను ఆన్‌లైన్ మధ్యవర్తిత్వం, మధ్యవర్తిత్వ తీర్పు ప్రక్రియ ద్వారా వేగంగా పరిష్కరించుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. దీంతో సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు రావాల్సిన బకాయిలను త్వరగా పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

### ఆలస్యమైన చెల్లింపుల వివాదాలకు వేగవంతమైన పరిష్కారం

మధ్యవర్తిత్వ తీర్పును రద్దు చేయాలని దాఖలైన కేసు ఆరు నెలలకు మించి పెండింగ్‌లో ఉన్న సందర్భంలో, తీర్పు ద్వారా నిర్ణయించిన మొత్తంలో కనీసం యాభై శాతం చెల్లించాలని న్యాయస్థానాలు ఆదేశించే అవకాశం ఉంటుందని జిల్లా పరిశ్రమల మేనేజర్ తెలిపారు. అలాగే, మధ్యవర్తిత్వం ద్వారా కుదిరిన రాజీ ఒప్పందాలు, మధ్యవర్తిత్వ తీర్పులను భూ బకాయిల మాదిరిగా వసూలు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ చర్యల ద్వారా సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు చెల్లింపుల విషయంలో మరింత భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు సంబంధించిన వాణిజ్య బిల్లుల చెల్లింపులను వేగవంతం చేసి, వాటి నగదు లభ్యతను మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు వాణిజ్య బిల్లుల ఎలక్ట్రానిక్ రాయితీ వ్యవస్థ ద్వారా చెల్లింపు లను నిర్వహించే విధానం ప్రతిపాదించ బడిందని ఏ. కీర్తి కాంత్ తెలిపారు. దీని ద్వారా పరిశ్రమలకు అవసరమైన నిర్వహణ మూలధనం అందుబాటులో ఉండటంతో పాటు, వ్యాపార కార్యకలాపాలను నిరంతరాయంగా కొనసాగించేందు కు అవకాశం ఉంటుందని తెలిపారు. సదుపాయ మండళ్ల ద్వారా కేసుల వేగవంతమైన పరిష్కారం ఆలస్యమైన చెల్లింపులకు సంబంధించిన కేసులను వేగంగా పరిష్కరించేందుకు రాష్ట్రాలు ఒకటి కంటే ఎక్కువ సూక్ష్మ మరియు చిన్న పరిశ్రమల సదుపాయ మండళ్లను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. చిన్నపాటి నేరాలను క్రిమినల్ కేసులుగా కాకుండా పౌర జరిమానాల ద్వారా పరిష్కరించే విధానం కూడా ప్రతిపాదించ బడిందని వివరించారు. పెద్దపల్లి జిల్లాలోని సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు కొనుగోలుదారుల నుంచి చెల్లింపులు ఆలస్యమవుతున్నట్లయితే, సమస్య పరిష్కారం కోసం సూక్ష్మ, చిన్న పరిశ్రమల సదుపా య మండలి, కరీంనగర్ ను ఆశ్రయించవచ్చని జిల్లా పరిశ్రమల మేనేజర్ ఏ. కీర్తి కాంత్ సూచించారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమల యూనిట్లు తమ సంస్థలను ఉద్యమ్ నమోదు ద్వారా నమోదు చేసుకోవడంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సదుపాయాలు, విధానాలు మరియు వివాద పరిష్కార వ్యవస్థలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### పరిశ్రమల అభివృద్ధికి అనుకూల వాతావరణం

ఎంఎస్ఎంఈడీ సవరణ బిల్లు–2026 ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నియంత్రణ వ్యవస్థను మరింత సరళీకృతం చేయడం, సకాలంలో చెల్లింపులు అందేలా చూడడం, ఆలస్యమైన చెల్లింపుల వివాదాలను వేగంగా పరిష్కరించడం, నగదు లభ్యత ను మెరుగుపరచడం వంటి చర్యలకు ప్రాధాన్యత లభిస్తుందని జిల్లా పరిశ్రమల మేనేజర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ పరిశ్రమలను మరింత అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా జిల్లాలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సకాలంలో చెల్లింపులు, వేగవంతమైన వివాదాల పరిష్కారం, సులభతరమైన వ్యాపార నిర్వహణకు ఎంఎస్ఎంఈడీ సవరణ బిల్లు–2026 దోహదపడుతుందని, జిల్లా పరిశ్రమల మేనేజర్ పేర్కొన్నారు.



## ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు

**పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల**

ప్రజానావ, పెద్దపల్లి : హిందూ మహిళల సాంప్రదాయానికి నిదర్శనం ఆషాఢ మాస గోరింటాకు వేడుకలని పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. పెద్దపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ మాస గోరింటాకు వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఆషాఢ మాసంలో పెట్టుకున్న గోరింటాకు ఎర్రగా పండిన వారి జీవితం సుఖ శాంతులతో ఉంటుందని మహిళల నమ్మకం అన్నారు. ఇలాంటి సాంప్రదాయ వేడుకలు ప్రతి మహిళా జరుపుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, ఫోక్సో న్యాయమూర్తి స్వప్న రాణి, సీనియర్ సివిల్ జడ్జి భవాని, జూనియర్ సివిల్ జడ్జి ఎన్. మంజుల, నంది మేడారం జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత, పలువురు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ ఆస్పత్రుల నర్సులకు ఆరోగ్య బీమా కల్పించాలి

- నర్సుల హక్కులపై యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చించాలి
- పనివేళలు, వేతనాలు, ఓవర్‌టైమ్‌పై స్పష్టమైన నిబంధనలు ఉండాలి

ప్రజానావ, హైదరాబాద్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం లేకపోవడం బాధాకరమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తనను కలిసిన ప్రైవేట్ ఆస్పత్రుల నర్సులతో ఆమె మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రజల నుంచి భారీ మొత్తాల్లో వైద్య ఖర్చులు వసూలు చేస్తున్నప్పటికీ, అక్కడ పనిచేసే సిబ్బందికి మాత్రం కనీస సౌకర్యాలు కల్పించకపోవడం సరికాదన్నారు. ముఖ్యంగా నర్సులకు ఆరోగ్య బీమా సౌకర్యం లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించి, అక్కడ పనిచేసే నర్సులు, ఇతర సిబ్బందికి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పనివేళలు, వేతనాలు, ఓవర్‌టైమ్ వంటి అంశాల్లో తెలంగాణకు చెందిన ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తూ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సులు, ఇతర సిబ్బంది హక్కుల కోసం తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు.

# వర్షాభావం.. వరికి దూరంగా ఉండండి

- ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లాలి
- ప్రాజెక్టుల నీరు తాగునీటికే పరిమితం
- ఆగస్టు–సెప్టెంబర్‌లో వర్షాలు కురిస్తే సాగునీటి విడుదలకు సిద్ధం
- జిల్లా నీటిపారుదల సలహా కమిటీలో కలెక్టర్ హైమావతి

ప్రజానావ, సిద్దిపేట: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో రైతులు వరి సాగుకు దూరంగా ఉండి ఆరుతడి పంటల వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు కురిస్తే పరిస్థితులను బట్టి ప్రాజెక్టుల నుంచి సాగునీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నీటిపారుదల సలహా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవ్‌రెడ్డి, నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు పాల్గొన్నారు.



జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో పరిమితంగా ఉన్న నీటి నిల్వల వివరాలను గజ్వేల్ సర్కిల్ చీఫ్ ఇంజినీర్ శివధర్మతేజ సమావేశంలో వెల్లడించారు. అన్నపూర్ణ సాగర్‌లో 3.50 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికి గాను 1.51 టీఎంసీల నీరు ఉండగా, 0.32 టీఎంసీల డెడ్ స్టోరేజీని మినహాయిస్తే 1.19 టీఎంసీలు వినియోగానికి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రంగనాయకసాగర్‌లో 3 టీఎంసీలకు గాను 0.99 టీఎంసీల నీరు ఉండగా, 0.17 టీఎంసీల డెడ్ స్టోరేజీని మినహాయిస్తే 0.82 టీఎంసీలు అందుబాటు లో ఉన్నాయని వివరించారు. మల్లన్నసాగర్‌లో 50 టీఎంసీలకు గాను 13.86 టీఎంసీల నీరు ఉండగా, డెడ్ స్టోరేజీని మినహాయిస్తే 4.12 టీఎంసీలు వినియోగానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొండపోచమ్మసాగర్‌లో 15 టీఎంసీలకు గాను 6.31 టీఎంసీల నీరు ఉండగా, 2.20 టీఎంసీల డెడ్ స్టోరేజీని మినహాయిస్తే 4.11 టీఎంసీలు అందుబా టులో ఉన్నట్లు చెప్పారు. శనిగరం ప్రాజెక్టులో 1.09 టీఎంసీలకు గాను 0.46 టీఎంసీల నీరు అందుబాటు లో ఉందన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని తాగునీటి అవసరా లకు మాత్రమే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించినట్లు సీఈ తెలిపారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు కొత్తగా నీరు చేరలేదని తెలిపారు. తిరిగి వర్షాలు కురిసే వరకు ప్రాజెక్టుల్లోని నీటిని తాగునీటి అవసరాల కోసం రిజర్వ్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో సాగునీటి లభ్యత లేనందున రైతులు వరి పంట సాగు చేయవద్దని సూచించారు. గత ఏడాది జిల్లాలో 4.82 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, అందులో 3.68 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలిపారు. సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యానికి ప్రభుత్వం రూ.1,200 కోట్లకు పైగా చెల్లించిందని వెల్లడించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించడంతో ఇప్పటివరకు సుమారు 70 వేల ఎకరాల్లో పంట మార్పిడి జరిగిందని తెలిపారు. రైతులు కందులు, పెసర్లు, మినుములు, చిరుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్నారని చెప్పారు. ఆగస్టు 15 తర్వాత ఆముదం, పత్తి, నూనెగింజలతో పాటు ఇతర ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు కురిస్తే పరిస్థితులను బట్టి సాగునీటి ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్సీ వంటేరు యాదవ్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసి గూడవల్లి, హల్దీవాగులోని చెక్‌డ్యామ్‌లను నింపితే ఆయా ప్రాంతాల రైతులకు కొంతమేర వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పంపిన లేఖను కలెక్టర్ సమావేశంలో చదివి వినిపించారు. గోదావరి నది నుంచి వృథాగా సముద్రంలోకి వెళ్లే నీటిని లిఫ్ట్ చేసి సాగునీటి ప్రాజెక్టులను నింపాలని హరీశ్‌రావు తన లేఖలో కోరినట్లు తెలిపారు. తద్వారా రైతులకు సాగునీరు అందించడంతో పాటు భూగర్భజలాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో కరీంనగర్ సర్కిల్ సీఈ సత్యనారాయణరెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, కరీంనగర్ సర్కిళ్ల ఎస్ఈలు సూర్యకిరణ్, లక్ష్మణ్ పల్లంరాజు, జిల్లా ఇరిగేషన్ అధికారి నాగరాజు, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో వేళ.. నీటి లభ్యతపై అప్రమత్తత అవసరం

- వరి సాగులో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలి
- 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ: కలెక్టర్ కె.హరిత

ప్రజానావ, ఆసిఫాబాద్: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో నీటి లభ్యతపై రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ కె.హరిత సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితోపాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు పంటల సాగులో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బోరుబావులు ఉన్న రైతులు సైతం వరి సాగుకు అవసరమైన స్థాయిలో నీరు పూర్తిగా అందుబాటులో ఉంటుందా అనే విషయాన్ని ముందుగానే పరిశీలించుకోవాలని అన్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ, వరి సాగుకు అవసరమైన స్థాయిలో నీటి లభ్యత ఉండకపోవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంచుకోవడం ద్వారా రైతులు మంచి దిగుబడులతోపాటు మెరుగైన లాభాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికలో రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానుందని కలెక్టర్ కె.హరిత తెలిపారు. మండల, గ్రామస్థాయిలో ప్రణాళికాబద్ధంగా కార్డుల పంపిణీ చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని చెప్పారు. ఎక్కడైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తిస్తే ప్రజలు వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

# మహిళల అభ్యున్నతే.. రాష్ట్ర ప్రగతికి బాట

- ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ
- మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ప్రజానావ, వరంగల్: మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వరంగల్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్‌కు చెందిన మహిళలకు అరెపల్లిలోని వికె గార్డెన్స్‌లో ఇందిరా మహిళా శక్తి చీరలను ఎమ్మెల్యే నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరల్లో నాణ్యత లోపించడంతో చాలామంది మహిళలు వాటిని ఉపయోగించుకోలేకపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలకు ఉపయోగపడేలా నాణ్యమైన చీరలను తయారు చేయించి అందిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన కానుకలను అందించడంతోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కర్, మాజీ కార్పొరేటర్ జన్ను అనిల్ శిభారాణి, సొసైటీ చైర్మన్ బుద్దె పెద్దన్న, సీనియర్ నాయకులు అభిషేకం, సంపత్, సుధాకర్, రవికుమార్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ 100 శాతం పూర్తి

ప్రజానావ, ములుగు: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ములుగు నియోజకవర్గంలో ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జూన్ 25న ప్రారంభమైందని, తొలి దశలో జూన్ 25 నుంచి 30వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టి నియోజకవర్గంలో 100 శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు.

EDITORIAL



# ఎవరి కోసం వీరి ఆందోళనలు?

ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పాలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజల కు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు.

పార్లమెంట్ సమావేశాలు ఆందోళనలో కొనసాగడం లేదు. విపక్షాలు వెల్‌లోకి దూసుకుని రావడం..ప్లకార్డులు ప్రదర్శించడం.. వాయిదా పడడం షరామామూలుగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పాలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజల కు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన చలో పార్లమెంటు ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో ఢిల్లీ రణరంగమైన ఉదంతాన్ని ఆసారా చేసుకుని అదేపనిగా పార్లమెంటులో గందరగోళం చేస్తున్నారు. సభ వాయిదా పడగానే బయటకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం అధికార ఎన్‌డిఏ ఎంపిలు డా విపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వారు కూడా విపక్షాల తీరుపై ప్లకార్డులు ప్రదర్శిం చారు. ఇలా పోటాపోటీగా సభలో చర్చలు సాగాలి. కానీ సభను స్తంభింపచేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు ఏం కావాలి. జార్ఖండ్‌లో కూడా ఢిల్లీ జంతర్‌మంతర్ ఘటననే రిపీట్ అయ్యింది. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. జంతర్‌మంతర్ ఘటన మరువ కముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరి ణామం చోటుచేసుకుంది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగా ర్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కానీ వారిని ఏనాడు రాహుల్, ప్రియాంకలు వెళ్లి పరామర్శించలేదు. ఇండియా టమి నేతలు ఎవ్వరూ జార్ఖండ్ గురించి మాట్లాడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ రాంచీలో అసెంబ్లీని ముట్టడిం చేందుకు వారు సోమవారం వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరం వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసు లు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీ ఛార్జి చేశారు. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌ఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది. నిజంగానే సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో హేమంత్ సోరెన్ ప్రకటన చేయాలి. ప్రకటన చేసేలా ఇండియా టమి నేతలు రాయబారం నడపాలి. ఢిల్లీ జంతర్‌మంతర్ ఎలాగో ఇక్కడా అలాగే పోలీ సులు వ్యవహరించారు. శాంతిభద్రతలు మాంటని వారు మిన్నకుంటే అసెంబ్లీ వైపు ఆందోళనకారులు దూసుకుని వచ్చేవారు. లాఠీఛార్జ్ చేయవద్దని లేదా చేయాలని పోలీసులకు ఎవ్వరూ చెప్పరు. తమ విధులను నిర్వహించే పోలీసులను తప్పు పట్టడానికి లేదు. ఇకపోతే ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యా రు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్ తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్‌ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట బీజేపీ నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందో ళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ... ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని బీజేపీ నిలదీసింది. విద్యార్థు లపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపు నిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.



## కోతుల దాడిలో ఐదేళ్ల బాలుడికి తీవ్ర గాయాలు

- పాఠశాల పరిసరాల్లో కోతుల సంచారం
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**ప్రజానావ, మోత్కూరు** : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద మరోసారి తీవ్ర భయాందోళనకు గురిచేసింది. కొండగడపలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఐదేళ్ల బాలుడు తొంట యశ్వంత్‌పై మంగళవారం కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పాఠశాల పరిసరాల్లో ఉన్న సమయంలో కోతులు బాలుడిపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. దాడిలో గాయపడిన యశ్వంత్‌ను వెంటనే మోత్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొండగడపలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, పాఠశాల పరిసరాల్లోనూ అవి విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల సమస్యపై గతంలోనే సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. చిన్నారుల భద్రతకు ముప్పు పొంచి ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పాఠశాల పరిసరాల్లో కోతుల సంచారాన్ని తక్షణమే అరికట్టి, విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.

## ఆరుతడి పంటల సాగుతో అధిక లాభాలు

- పంట మార్పిడితో రైతులకు మెరుగైన ఆదాయం
- నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం
- రైతులతో మాట–పంట మార్పిడికి బాట కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ దిశానిర్దేశం



**ప్రజానావ, సూర్యాపేట:** వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో నీటి లభ్యత తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ సూచించారు. వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు, పంట మార్పిడి, అంతర పంటల సాగుపై దృష్టి సారించాలని ఆయన రైతులకు సూచించారు. మంగళవారం జిల్లాలో నిర్వహిస్తున్న 'రైతుల తో మాట–పంట మార్పిడికి బాట' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆత్మకూరు, మద్దిరాల, నూతనకల్లు మండలాల్లో పర్యటించి నేరుగా వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడారు. ఆత్మకూరు మండలంలోని వీరారెడ్డి, సందీప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేస్తున్న పెసర, బంతి తోటలను పరిశీలించిన కలెక్టర్ పంటల సాగు విధానం, దిగుబడులు, రైతులకు వస్తున్న ఆదాయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో రైతు సౌనయ్య సాగు చేస్తున్న 'జర్బరా' పూల పాలీహౌస్‌ను పరిశీలించి అభినందించారు. వరికి ప్రత్యామ్నాయంగా ఇలాంటి కొత్త రకం పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా మంచి లాభాలు పొందవచ్చని తెలిపారు. కంది, బొబ్బర్లు, వేరుశనగ, మొక్కజొన్న, జొన్నలు, సజ్జలు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలను సాగు చేస్తే తక్కువ కాలంలోనే ఆదాయం చేతికి వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. మద్దిరాల మండలం పోలుమల్లలో రైతు ఎల్లు వెంకటరెడ్డి ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా పెసర సాగు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. మిగిలిన భూముల్లో మిర్చి సాగు చేపట్టాలని రైతుకు సూచించారు. నూతనకల్లు మండలంలో కొండ్ర వెంకటరెడ్డి, వినోద్ వ్యవసాయ క్షేత్రాల్లో పత్తి, కంది అంతర పంటల సాగును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగును తగ్గించుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటల వైపు మళ్లాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ఒక ఉద్యమంలా చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులకు పంట సాగు విధానం, పెట్టుబడులు, దిగుబడులు, మార్కెటింగ్ తదితర అంశాలపై పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆయా మండలాల్లో ఆయిల్‌పామ్ సాగులో విజయవంతమైన రైతుల విజయగాథలను ఇతర రైతులకు వివరించి వారిని ప్రోత్సహించాలని తెలిపారు. పది రోజులపాటు నిర్వహిస్తున్న 'రైతులతో మాట' కార్యక్రమాన్ని అధికారులు అత్యంత ప్రాధాన్యంతో చేపట్టి విజయవంతం చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న వ్యవసాయ భూములను గుర్తించి ఆయా భూముల రైతులను పంట మార్పిడి వైపు మళ్లించాలని సూచించారు. ప్రతి మండలంలో అవసరమైన విత్తనాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ విస్తరణ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటలు, అంతర పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఆత్మకూరు (ఎస్), నూతనకల్లు, మద్దిరాల మండలాల ప్రత్యేక అధికారులు డి.విశాల్, భారతి, తహసీల్దార్లు అమిన్‌సింగ్, శ్రీనివాస్, తబితతో పాటు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చచ్చినా.. బతికినా ఎర్రజెండాతోనే!

- పదవుల కోసం పార్టీలు మారడం కమ్యూనిస్టుల నైజం కాదు
- ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం
- సీపీఐని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం:** రాజకీయ స్వార్థం, పదవీ కాంక్ష కోసం జెండాలు మార్చే సంస్కృతి పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లోనూ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయడమే కమ్యూనిస్టుల నైజమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. తనకు రాజకీయ ఊపిరి పోసి, గుర్తింపు తీసుకొచ్చింది ఎర్రజెండానేనని, చచ్చినా.. బతికినా ఆ జెండా నీడలోనే ఉంటానని, చివరి శ్వాస వరకు శ్రామికవర్గం పక్షాన పోరాడతానని తేల్చి చెప్పారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం సుజాతనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కమ్యూనిజం సిద్ధాంతాలను విడిచిపెట్టే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు. ప్రస్తుత రాజకీయాల్లో అధికారంలోకి రావడం కోసం కొందరు నాయకులు సిద్ధాంతాలు, విలువలను పక్కనపెట్టి పార్టీలు మారుతున్నారని కూనంనేని విమర్శించారు. పదవులు, ఆస్తులు సంపాదించుకునేందుకు రాజకీయాలను ఉపయోగించుకునే సంస్కృతికి కమ్యూనిస్టులు పూర్తి వ్యతిరేకమని పేర్కొన్నారు. ఎర్రజెండా నీడలో పెరిగిన ప్రతి కార్యకర్తకు ప్రజాసేవ, పోరాట పటిమే ముఖ్యమని, పదవులు తమకు ఎన్నడూ ప్రాధాన్యం కాదని స్పష్టం చేశారు. ఎన్ని కష్టాలు, ప్రలోభాలు ఎదురైనా కమ్యూనిజం భావజాలానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన చారిత్రాత్మక తెలంగాణ సాయుధ పోరాటం నుంచి నేటి వరకు ఎర్రజెండా పేద ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతోందని వివరించారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదల గొంతుకగా సీపీఐ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. సమాజంలో అసమానతలు తొలగిపోయే వరకు, ప్రజా స్వామ్య హక్కులను పరిరక్షించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని, సీపీఐని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని కూనంనేని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ఎన్ని మార్పులు వచ్చినా, ఎవరు ఎటు వెళ్లినా ఎర్రజెండా ఎప్పటికీ పేదల పక్షానే నిలబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 12వ వేతన ఒప్పందం కోసం పోరుబాట

కార్మిక సంఘాలు

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం:** బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందం కోసం వెంటనే వేతన కమిటీని ఏర్పాటు చేసి చర్చల ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు ఆందోళనను ఉధృతం చేశాయి. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా, ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 2026 జూలై 1 నుంచే 12వ వేతన ఒప్పంద కాలపరిమితి ప్రారంభమైనప్పటికీ, వేతన కమిటీ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం కార్మికుల పట్ల తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అమలైన 11 వేజ్ బోర్డుల తరహాలోనే చర్చల ద్వారా నూతన వేతన ఒప్పందాన్ని సాధించేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేసి చర్చలకు మార్గం సుగమం చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేతో భూధార్ కార్డులు

- ప్రతి భూమికి డిజిటల్ మ్యాప్
- రైతుల సమక్షంలోనే హద్దుల నిర్ధారణ
- రీ–సర్వేతో భూ వివాదాలకు చెక్
- రైతులకు శాశ్వత భద్రత: కలెక్టర్ దివాకర్ టీఎస్



**ప్రజానావ, ఖమ్మం/సత్తుపల్లి:** రైతుల భూములకు సంబంధించిన వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డుల్లోని లోపాలను ఎవరికి అన్యాయం జరగకుండా పారదర్శకంగా పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ–సర్వే ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ తెలిపారు. మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన ఆయన బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ–సర్వే ప్రక్రియను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంగారం గ్రామంలోని పంట పొలాల్లో గట్టు వెంబడి నడుచుకుంటూ వెళ్లి రైతుల సమక్షం లో నిర్వహిస్తున్న రీ–సర్వేను పరిశీలించారు. అనంతరం బేతుపల్లి, నారాయణపురం గ్రామాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సర్వేపై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలోని బేతుపల్లి రెవెన్యూ పరిధిలో గంగారం, బేతుపల్లి, నారాయణపురం, రామగోవిందపురం, ఎం.వి. పాలెం, రామనగర్, పాకాల గూడెం గ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో భూ రీ–సర్వే కొనసాగుతోందని తెలిపారు. మొత్తం 10 బృందాలతో చేపట్టిన ఈ ప్రక్రియలో ఇప్పటివరకు 4 వేల ఎకరాల రైతుల భూముల రీ–సర్వే పూర్తయిందని వివరించారు. ప్రతి మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్టే ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న భూ రీ–సర్వే ద్వారా ప్రతి రైతు భూమికి డిజిటల్ మ్యాప్‌తో కూడిన భూధార్ కార్డు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గతంలో కొంతమంది రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులు లేకపోవ డం, ఆన్‌లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి తేడాలు ఉండడం వంటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. కొంతమంది రైతుల భూమి విస్తీర్ణం తక్కువగా, మరికొందరిది ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, భూ రీ–సర్వే ద్వారా ఇలాంటి లోపాలన్నిం టినీ గుర్తించి సరిచేస్తామని స్పష్టం చేశారు. ప్రతి రైతుకు సర్వేకు 48 గంటల ముందుగానే నోటీసులు జారీ చేస్తామ ని, రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలుస్తామని తెలిపారు. రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపించాలని, పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచ నామా నిర్వహించడం ద్వారా హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. భూ సర్వేకు నోటీసులు అందుకున్న రైతులు, వారి కుటుంబంలోని భూ హక్కుదారులు, పట్టాదారు పాస్‌బుక్‌లో భూమి ఉన్న వారందరూ తప్పనిసరిగా స్వయంగా సర్వే సమయంలో హాజరై పూర్తి వివరాలు అందించి అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. సర్వే పూర్తయిన వెంటనే నమోదైన భూమి విస్తీర్ణాన్ని రైతులకు అక్కడికక్కడే తెలియజేస్తామని చెప్పారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే మరోసారి సర్వే నిర్వహించి, వారు పూర్తిగా సంతృప్తి చెందే వరకు ప్రక్రియను పారదర్శ కంగా కొనసాగిస్తామని, నమోదైన భూమి విస్తీర్ణంపై రైతుల నుంచి సంతకం కూడా తీసుకుంటామని తెలిపారు. భూ రీ–సర్వే మొత్తం ప్రక్రియ భూ హక్కుదారుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని విశ్వసించి భూ రీ–సర్వే కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించ డంతోపాటు వాటిని గ్రామపంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తామని తెలిపారు. వివరాలపై అభ్యంతరాలు ఉంటే నిర్దిష్ట గడువులో స్వీకరించి పరిష్కరిస్తామని, అనంతరం భూ వివరాలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. భూ రీ–సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గడంతోపాటు రైతులకు భూమిపై శాశ్వత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర్ టీఎస్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి తహసీల్దార్ సత్యనారాయణ, గ్రామ సర్పంచులు, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 575కు చేరనున్న పోలింగ్ కేంద్రాలు

రేషనలైజేషన్‌పై పార్టీల ప్రతినిధులతో సమావేశం



**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** జిల్లాలో రేషనలైజ్డ్ పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలపై రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రేషనలైజేషన్ ప్రక్రియ గడువు ముగిసిన నేపథ్యంలో అందిన ప్రతిపాదనలను నిబంధనల మేరకు పరిశీలించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలో ప్రస్తుతం 257 పోలింగ్ కేంద్రాలు ఉండగా మరో ఐదు, ఆలేరు నియోజకవర్గంలో 309 ఉండగా మరో నాలుగు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చినట్లు వివరించారు. దీంతో ప్రతిపాదనలు ఆమోదం పొందితే మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 575కు చేరుతుందని తెలిపారు. మార్పులు, విలీనాలు, కొత్త కేంద్రాల ఏర్పాటులో ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## యరుగండ్లపల్లిలో జల మహోత్సవం

నీటి సంరక్షణకు సర్పంచ్ సంతోష్ పిలుపు



**ప్రజానావ, మర్రిగూడ:** భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ పిలుపునిచ్చారు. జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం యరుగండ్లపల్లిలో నిర్వహించిన 'జల మహోత్సవం–హర్ ఘర్ జల్' కార్యక్రమంలో ఆయన గ్రామస్తులతో జల ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకుని భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ సంతోష్ యాదవ్ చొరవను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించడంలో ప్రత్యేక దృష్టి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ఏడాదిలో 2,872 మందికి ఉద్యోగాలు
- ఉపాధి కల్పనకు వివిధ శాఖలు, సంస్థల సమన్వయంతో నిరంతర చర్యలు
- యువతకు నైపుణ్య శిక్షణతో పాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- జిల్లాలోని ప్రతి యువతకు ఉపాధి అవకాశాలు అందేలా కార్యాచరణ



**ప్రజానావ, పెద్దపల్లి :** జిల్లాలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, గత ఒక సంవత్సరం కాలంలో వివిధ ప్రభుత్వ శాఖలు, శిక్షణా సంస్థలు, ప్రైవేట్ సంస్థల సమన్వయంతో జిల్లాలో మొత్తం 2,872 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. యువతలోని నైపుణ్యాలను గుర్తించి, వారికి తగిన శిక్షణ అందించడంతో పాటు, ఉద్యోగ అవకాశాలకు అనుసంధానం చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, టాస్క్, గో ఫ్లై, ఇండియన్ ఆర్మీ–అగ్నివీర్, టాటా లైఫ్ సైన్సెస్, ఐటీఐ కళాశాల తదితర సంస్థల ద్వారా పెద్ద సంఖ్యలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో 904 మందికి, టాస్క్ ద్వారా 979 మందికి, గో ఫ్లై ద్వారా 17 మందికి, ఇండియన్ ఆర్మీ –అగ్నివీర్ నియామకాల ద్వారా 23 మందికి, టాటా లైఫ్ సైన్సెస్ ద్వారా 25 మందికి, ఐటీఐ కళాశాల ద్వారా 924 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ సంస్థల సమన్వయంతో మొత్తం 2,872 మంది యువత ఉద్యోగాలు పొందడం జిల్లాలో ఉపాధి కల్పనకు చేపడుతున్న చర్యలకు నిదర్శనమని అన్నారు. యువతకు కేవలం శిక్షణ అందించడం మాత్రమే కాకుండా, శిక్షణ అనంతరం వారికి ఉద్యోగాలు లభించేలా సంబంధిత సంస్థలతో సమన్వయం చేయాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఉద్యోగ మేళాలు, క్యాంపస్ నియామకాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, వివిధ నియామక ప్రక్రియల ద్వారా మరిన్ని అవకాశాలను యువతకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

### యువతలోని ప్రతిభకు ప్రత్యేక కార్యాచరణ

జిల్లాలోని యువత విద్యార్హతలు, నైపుణ్యాలు, ఆసక్తులకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రైవేట్ పరిశ్రమలు, సంస్థలు, శిక్షణా కేంద్రాలతో సమన్వయం పెంచి జిల్లాలోనే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యువత తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగు పరుచుకుంటూ అందుబాటులో ఉన్న ఉద్యోగ, శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థలు, శిక్షణా సంస్థలు, పరిశ్రమలు సమన్వయంతో పనిచేస్తే మరింత పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రతి యువకుడు, యువతి తమ విద్యార్హతలకు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగాన్ని పొందేలా జిల్లా యంత్రాం గం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఉపాధి కల్పన కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి, జిల్లాలోని యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ కొనసాగిస్తామని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో చొరవ చూపిన జిల్లా ఉపాధి కార్యాలయం, టాస్క్, ఐటీఐ కళాశాల, వివిధ నియామక సంస్థలు, శిక్షణా సంస్థలు, సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. యువతకు ఉపాధి కల్పనలో సాధించిన ఈ ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లి, పెద్దపల్లి జిల్లాను నైపుణ్యం –ఉపాధి కల్పనలో మరింత ముందంజలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. యువతకు నైపుణ్యాలు, శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలను అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. గత ఒక సంవత్సరం కాలంలో 2,872 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన విధంగానే, భవిష్యత్తులో కూడా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల సమన్వయంతో మరింత మంది యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల అడ్మిషన్లు.. తల్లిదండ్రుల నమ్మకానికి నిదర్శనం

పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరగడం సంతోషకరమైన విషయమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 31,140 మంది విద్యార్థులు నమోదు కాగా, 2026–27 విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 32,639 మంది విద్యార్థులు నమోదు అయినట్లు తెలిపారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 1,499 మంది విద్యార్థులు అదనంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని, ఇది సుమారు 4.82 శాతం పెరుగుదల అని పేర్కొన్నారు. కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, జడ్.పి.హెచ్.ఎస్., ఎంపీపీ పాఠశాలలు తదితర ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం పట్ల జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలపై తల్లిదండ్రులు ఉంచుతున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, విద్యా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించి, వారు అన్ని రంగాల్లో రాణించేలా అవసరమైన ప్రోత్సాహం అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరగడం ప్రజల్లో ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసం పెరుగుతోందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవేశాల పెరుగుదలలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో కృషి చేస్తున్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని మరింత బలోపేతం చేసేలా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు.



## సిరిసిల్ల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం వేడుకలు

### నిర్మాణం త్వరగా పూర్తిచేసుకుని గుడి స్థాపితం కావాలని పోచమ్మకు మొక్కులు చెల్లింపు

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పద్మశాలి సంఘం డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఆషాడ మాసం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం పోచమ్మ మొక్కలను గొర్రె పొట్టేలుతో చెల్లించుకున్నారు. సిరిసిల్ల శివ భక్త మార్కండేయ దేవాలయం నిర్మాణం త్వరగా పూర్తి చేసుకొని తొందరగా గుడి స్థాపితం కావాలని పోచమ్మ కు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో పద్మశాలి సంఘం అధ్యక్షులు దూడం శంకర్, పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు, అలాగే 39 మంది వార్డ్ డైరెక్టర్లు పాల్గొన్నారు. <

## 23న సిరిసిల్ల పద్మశాలి యువజన సంఘం ఎన్నికలు

### సమాజ పెద్దల సమక్షంలో ఎన్నికల అధికారికి బాధ్యతలు అప్పగింత



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పద్మశాలి యువజన సంఘం ఎన్నికలు ఈనెల 23న జరుపనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం పద్మశాలి కుల పెద్దల సమక్షంలో పద్మశాలి యువజన సంఘం సిరిసిల్ల యొక్క ఎన్నికల నిర్వహణ కొరకు అధ్యక్షులు గుండ్లపెల్లి పూర్ణచందర్ ఎన్నికల అధికారి మామిడాల భూపతి కి బాధ్యతలు అప్పగించారు. వచ్చే వారంలో అనగా తేదీ: 23–08–2026 ఆదివారం రోజున ఎన్నికలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి త్వరలోనే యువజన సంఘం సభ్యుల తుది జాబితాను, నోటిఫికేషన్ ను విడుదల చేస్తామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షులు దూడం శంకర్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు చక్రపాణి, పవర్లూమ్ టెక్స్టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ దార్నమ్ లక్ష్మీ నారాయణ, సీనియర్ గాజుల బాలయ్య, గుండ్లపల్లి శ్రీనివాస్, గెంట్యాల శ్రీనివాస్, పద్మశాలి మహిళా సంఘం ప్రతినిధులు గజ్జె తార, పత్తిపాక పద్మ, కాముని వనిత, ఆడెపు చంద్రకళ పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల వేడుకలు

### ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ



**ప్రజానావ, గంభీరావుపేట:** ఆషాడ మాస బోనాల వేడుకలు మంగళవారం గంభీరావుపేట మండలం గజ సింగవరం గ్రామంలో ఘనంగా జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు బోనాల వేడుకల్లో ఉత్సవముగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఉమ్మారెడ్డి విమల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాల వేడుకలు పురస్కరించుకొని విద్యార్థుల వేషధారణ పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రేవల్లి సర్పంచుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** రేవల్లి మండలంలోని టప్ప రాజయ్య నివాసంలో సర్పంచుల సమావేశం నిర్వహించారు. రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి సుల్తాన్ అలీ, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వాడల పర్వతాలు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేవల్లి మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా బాదేపల్లి రేవతి సురేష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా టప్ప రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా సభావత్ శ్రీను, కోశాధికారిగా జి. పావని ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శులుగా లోడే అంజలమ్మ శ్రీశైలం, పాంపురం రేణుక బాల్ నాగయ్య, బి. రాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులతో పాటు నాయకుడు మిద్దె స్వామి పాల్గొన్నారు. ఈ వివరాలు టిపిసిసి రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కూర చందు వెల్లడించారు.

## బాధిత కుటుంబానికి మేఘన్న అభయహస్తం సాయం

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** ఏదులలో ప్రమాదవశాత్తు మృతి చెందిన సురేష్ సాగర్ కుటుంబానికి మేఘన్న అభయహస్తం ద్వారా రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ విషయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పందెం సుఖేందర్ రెడ్డి.. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి సహాయాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరశురామ్ యాదవ్, ఎన్ఎస్ యూఐ గోపాల్ పేట మండల అధ్యక్షుడు జానకిరామ్ యాదవ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ యాదవ్, వార్డు మెంబర్ సంపయల రాముడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఆరోపణలపై మంథని మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజానావ, పెద్దపల్లి :** జిల్లా లోని మంథని నియోజకవర్గం, మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న కె.ఎన్. జయ ప్రకాశ్పై వచ్చిన ఆర్థిక ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఆగస్టు 7న మంథని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు శ్రీ కె.ఎన్. జయ ప్రకాశ్పై పలు ఆర్థిక ఆరోపణలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించి ప్రాథమికంగా విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, విధుల పట్ల అంకితభావం లోపించడం, ప్రభుత్వ ఉద్యోగికి తగని ప్రవర్తన వంటి అంశాలు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (ప్రవర్తనా) నిబంధనలు, 1964లోని రూల్ 3(1), 3(2) నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 20 ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (సీసీఏ) రూల్స్, 1991లోని రూల్ 8(1) ప్రకారం శ్రీ కె.ఎన్. జయ ప్రకాశ్ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనల ప్రకారం సస్పెన్షన్ కాలంలో జీవనాధార భత్యంతో పాటు డి.ఏ, ఇతర పరిహార భత్యాలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.



## ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలులో విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- ప్రజా సమస్యల పరిష్కారం కొరకే సీపీఐ ప్రజా చైతన్య యాత్రలు
- సిరిసిల్లలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య పాదయాత్ర ప్రారంభం
- సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్

**ప్రజానావ, సిరిసిల్ల :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందాయని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, పట్టణ కార్యదర్శి పంతం రవి ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సిపిఐ పార్టీ సిరిసిల్ల పట్టణ సమితి ఆధ్వర్యంలో సిరిసిల్ల కార్మిక వాడలైన బివైనగర్ జెండా చౌరస్తా నుండి పట్టణ కార్యదర్శి పంతం రవి ఆధ్వర్యంలో ప్రజా చైతన్య పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ పట్టణ కార్యదర్శి పంతం రవి మాట్లాడుతూ ప్రధానంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వము దేశ సంపద, సహజ వనరులను గంపగుత్తగా కార్పోరేట్ సంస్థలకు దోచిపెడుతుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక రకాల ప్రజలకు వాగ్దానాలు చేసిందని అవేవీ కూడా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తుందని ప్రధానంగా సిరిసిల్ల ప్రాంతంలోని పవర్లూమ్ పరిశ్రమకు సంబంధించి కార్మికులకు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 10 శాతం యారన్ సబ్సిడీలు తొలగించి కార్మికులను ఓనర్గా చేసే వర్కర్ టు ఓనర్ పథకాన్ని తుంగలో తొక్కే ప్రయత్నం చేయడం చాలా దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా

- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ
- అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే కాటిపల్లి

**ప్రజానావ, కామారెడ్డి:** కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని రాజంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. రాజంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక భరోసా లభిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





## గ్రామాల అభివృద్ధికి మూడేళ్ల ప్రణాళికలు

- ప్రజల అవసరాలే ప్రాతిపదికగా అభివృద్ధి పనుల ఎంపిక
- తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, ఉపాధి, నీటి సంరక్షణకు ప్రాధాన్యం
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**ప్రజానావ, కామారెడ్డి:** గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి కోసం గ్రామస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా మూడేళ్ల సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. 2026–27, 2027–28, 2028–29 ఆర్థిక సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని మూడు సంవత్సరాల కాలానికి గ్రామపంచాయతీల వారీగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, విద్య, వైద్యం, ఉపాధి, నీటి సంరక్షణ వంటి ప్రాథమిక అవసరాలకు ప్రణాళికల్లో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. చెయూత సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించి ఏడు రకాల పింఛన్లకు అర్హులైన వారి నుంచి వచ్చిన దరఖాస్తులను గ్రామస్థాయిలో స్వీకరించి, అర్హతలను పరిశీలించిన అనంతరం ఎంపీడీవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరం కాకుండా దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించాలని సూచించారు. గ్రామపంచాయతీల సమగ్ర ప్రణాళికల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, లబ్ధిదారులకు అందించాల్సిన సహకారం, నిర్మాణ పురోగతి తదితర అంశాలను చేర్చాలని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణాలు నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జలశ్రీ కార్యక్రమం ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే చర్యలకు గ్రామపంచాయతీ ప్రణాళికల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చెరువులు, కుంటలు, కాలువలు, ఇంకుడు గుంతలు, పొలాల కుంటలు, భూగర్భ జలాల పునర్భరణకు సంబంధించిన పనులను గ్రామ అవసరాలకు అనుగుణంగా గుర్తించి ప్రణాళికలో చేర్చాలని అన్నారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామపంచాయతీలకు అందుబాటులోకి వచ్చే నిధులను గ్రామాల ప్రాధాన్యత అవసరాలకు అనుగుణంగా, నిబంధనల మేరకు సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గ్రామపంచాయతీల సమగ్ర ప్రణాళికల రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని, గ్రామసభల ద్వారా స్థానిక అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను ఎంపిక చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. రూపొందించిన ప్రణాళికల అమలును అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డీఆర్డీవో దామోదర్ రెడ్డి, డీపీవో మురళి, సీఈవో చందర్, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ పునఃప్రారంభానికి యువజన పోరు గర్జన

- విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- రైతులు, మేధావులు, ప్రజా సంఘాలు ఉద్యమానికి మద్దతివ్వాలి
- మాజీ మంత్రి జోగు రామన్న

**ప్రజానావ, ఆదిలాబాద్:** ఆదిలాబాద్‌లో సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభం కోసం కొనసాగుతున్న ఉద్యమాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలను బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే మానుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. కమిషన్లపై చూపుతున్న శ్రద్ధను యువత భవిష్యత్తుపై చూపకపోవడం బాధాకరమని విమర్శించారు. సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభం కోసం సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యాపల్‌గూడ గ్రామస్తులు దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. శిబిరాన్ని సందర్శించిన జోగు రామన్న గ్రామస్తులను అభినందించారు. సీసీఐ పునఃప్రారంభం కోసం రైతు కుటుంబాలు సైతం దీక్షలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బుధవారం నిర్వహించనున్న విద్యార్థి యువజన పోరు గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కాసిం పాల్గొంటారని, సుమారు 10 వేల మంది విద్యార్థులు, యువత పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభం కోసం విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. రైతులు, రైతు కూలీలు, మేధావులు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు స్వచ్ఛందంగా యువజన పోరు గర్జనలో పాల్గొని ఉద్యమానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. యువతను ఏకం చేసి సీసీఐ పునఃప్రారంభం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జోగు రామన్న స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించిన జీవో పేరుతో సీసీఐ పరిశ్రమ అంశాన్ని తప్పుదోవ పట్టించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభం కోసం విద్యార్థులు, యువతతో కలిసి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లేష్, నారాయణ, ఆలాల్ అజయ్, సలీం, కొండ రమేష్, బొర్రన్న, అన్నమొల్ల కిరణ్, బుట్టి శివ, దాసరి రమేష్, గంద్రత్ రమేష్, చిన్నాన్న, బిల్ల రాజ్, కాంతారావు, గంగారాం, షఫీ, అగ్గిమాళ్ల రాజేశ్వర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.





# ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

- క్షిపణులు, డ్రోన్లతో పలు నగరాలపై విరుచుకుపడిన మాస్కో
- 9 మంది మృతి.. 19 మందికి గాయాలు

**కీవ్:** ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణులు, డ్రోన్లు, గ్లైడ్ బాంబులతో జరిపిన దాడుల్లో కనీసం తొమ్మిది మంది పౌరులు మృతి చెందారు. దక్షిణ ఉక్రెయిన్‌లోని జపోరిజ్జియాపై జరిగిన దాడిలో ఆరుగురు మరణించగా, 19 మంది గాయపడ్డారు. మధ్య ఉక్రెయిన్‌లోని డ్నిప్రోపెట్రోవ్స్క్ ప్రాంతంలో డ్రోన్లు, ఫిరంగి దాడుల్లో 15 ఏళ్ల బాలుడితో పాటు మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. రష్యాకు ఉత్తర కొరియా నుంచి అదనంగా బాలిస్టిక్ క్షిపణులు అందాయని, మరిన్ని ఉత్తర కొరియా సైనికులను యుద్ధంలోకి పంపేందుకు మాస్కో సిద్ధమవుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆరోపించారు. రష్యా క్షిపణుల ఉత్పత్తిని పెంచడం, ఉత్తర కొరియా సైనిక సామగ్రిని సమకూర్చుకోవడం, కొత్త సైనిక సమీకరణకు సిద్ధం కావడం.. ఇవన్నీ శాంతి కంటే యుద్ధాన్ని తీవ్రతరం చేయడానికే సంకేతాలని అన్నారు.

### కీవ్‌పైనా దాడులు

రాజధాని కీవ్‌లోని ఓ చిన్నారుల ఆసుపత్రి ప్రాంగణంలో రష్యా దాడితో రెండు భారీ గుంతలు ఏర్పడి, కిటికీలు ధ్వంసమయ్యాయి. అయితే పిల్లలు, వైద్య సిబ్బంది బాంబు రక్షణ కేంద్రాల్లో ఉండటంతో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. మరో ప్రాంతంలో గోదాములో మంటలు చెలరేగాయి. ఉక్రెయిన్‌పై రష్యా 120 దీర్ఘశ్రేణి డ్రోన్లతో పాటు జిర్కాన్, ఇస్కాండర్ క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. మరోవైపు తమ రక్షణ వ్యవస్థలు దాదాపు 400 ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నాయని రష్యా ప్రకటించింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా నేతృత్వంలో జరుగుతున్న దౌత్య ప్రయత్నాలు పెద్దగా పురోగతి సాధించకపోవడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతోంది. ఉక్రెయిన్ వద్ద పేట్రియాట్ క్షిపణుల కొరతను రష్యా సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని అమెరికా థింక్‌ట్యాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ వార్ పేర్కొంది.





# మంగళ్ మిలన్‌లో మోదీకి ఘన స్వాగతం

- త్రివర్ణ పతాకాలతో ఎన్డీయే ఎంపీల సందడి
- జలశక్తి కార్యక్రమాలపై పాటిల్ ప్రజెంటేషన్
- పార్లమెంట్ వద్ద ఎదురెదురుగా ఎన్డీయే, విపక్షాల నిరసనలు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ వారాంత సమావేశం 'మంగళ్ మిలన్' మంగళవారం ఉత్సాహంగా జరిగింది. పార్లమెంట్ ప్రాంగణంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. మోదీ సమావేశ మందిరంలోకి ప్రవేశించగానే ఎన్డీయే ఎంపీలు, కేంద్ర మంత్రులు త్రివర్ణ పతాకాలు చేతబట్టి 'వందే మాతరం', 'భారత్ మాతా కీ జై' అంటూ నినాదాలు చేశారు. మోదీ సైతం జాతీయ పతాకాన్ని చేతబట్టి సభ్యులకు అభివాదం చేశారు. సమావేశంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆ శాఖ చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. నీటి సంరక్షణ, నిర్వహణ, అభివృద్ధితో పాటు జాతీయ స్థాయిలో నీటి ప్రణాళిక, వివిధ అవసరాలకు అనుగుణంగా నీటి వనరుల సమన్వయంపై వివరించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, ఎస్. జైశంకర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఎన్డీయే భాగస్వామ్య పార్టీలకు చెందిన హెచ్.డి. కుమారస్వామి, కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాందాస్ అథవాలే, ప్రఫుల్ పటేల్, ఉపేంద్ర కుష్వాహా తదితరులు హాజరయ్యారు.

### మకర్ ద్వార్ వద్ద పోటాపోటీ నిరసనలు

సమావేశం అనంతరం ఎన్డీయే ఎంపీలు పార్లమెంట్ ప్రధాన ద్వారం మకర్ ద్వార్ వద్ద నిరసన చేపట్టారు. అదే సమయంలో ఇండియా కూటమి ఎంపీలు కూడా అక్కడ ఆందోళన నిర్వహించడంతో ఇరువర్గాలు ఎదురెదురుగా నిలిచాయి. జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్య, విద్యార్థుల ఆందోళనలపై రాహుల్‌గాంధీ వైఖరిని నిరసిస్తూ ఎన్డీయే సభ్యులు నినాదాలు చేశారు. రామ మందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యార్థులపై పోలీసుల చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. జూలై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న ముగియనున్నాయి. విపక్షాల ఆందోళనల కారణంగా సమావేశాలు పలుమార్లు వాయిదా పడ్డాయి.

# గల్లంతైతే వెంటనే ఎఫ్ఐఆర్

- వయసు, లింగంతో సంబంధం లేకుండా కేసు నమోదు చేయాల్సిందే
- 'చిన్నారులైతేనే మిస్సింగ్ కేసు' అన్న అపోహపై సుప్రీం ఆగ్రహం
- ఆదేశాలు అమలు చేయకపోతే సీఎస్‌లు, డీజీపీలే కోర్టుకు రావాలి
- మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక వ్యవస్థ
- రాష్ట్రాలు, కేంద్రానికి అత్యున్నత ధర్మాసనం కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ:** ఎవరైనా గల్లంతైనట్లు సమాచారం అందితే వారి వయసు, లింగంతో సంబంధం లేకుండా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గల్లంతైన వ్యక్తి చిన్నారే కావాలన్న కొన్ని రాష్ట్రాల అభిప్రాయంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో ఇచ్చిన ఆదేశాల్లోని 'వ్యక్తి' అనే పదం ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందని జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహదేవన్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో ఇచ్చిన ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేయని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 5కు వాయిదా వేసింది.

### 47వేల మంది చిన్నారులు గల్లంతు

దేశవ్యాప్తంగా ప్రస్తుతం 47 వేల మంది చిన్నారులు ఆచూకీ లేకుండా ఉన్నారని మే 22న సుప్రీంకోర్టు పేర్కొంది. చిన్నారుల గల్లంతు ఘటనల్లో అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల ప్రమేయం ఉండే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. గల్లంతైన వ్యక్తి సమాచారం అందిన వెంటనే ప్రాథమిక విచారణ కోసం వేచి చూడకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అప్పుడే పోలీసులను ఆదేశించింది. అన్ని పోలీస్ స్టేషన్లను అనుసంధానం చేస్తూ మానవ అక్రమ రవాణా, గల్లంతైన చిన్నారులు, మహిళలకు సంబంధించిన ప్రత్యేక పోర్టల్‌తో అఖిల భారత స్థాయి గ్రిడ్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖను ఆదేశించింది. ఎఫ్ఐఆర్‌లో భారతీయ న్యాయ సంహిత–2023లోని కిడ్నాప్, అక్రమ రవాణాకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా చేర్చాలని స్పష్టం చేసింది. చిన్నారి గల్లంతైన వెంటనే కిడ్నాప్ లేదా అపహరణకు గురైనట్లు భావించి దర్యాప్తు ప్రారంభించాలని సూచించింది. రక్షించిన చిన్నారులను కుటుంబ సభ్యులే అక్రమ రవాణా లేదా దోపిడీలో భాగస్వాములని ఆధారాలు లేనిపక్షంలో సాధారణంగా 24 గంటల్లో కుటుంబానికి అప్పగించాలని తెలిపింది. రక్షించిన వ్యక్తికి ఆధార్ ధ్రువీకరణ లేదా ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించింది. చెన్నైలో 2011 సెప్టెంబర్ 19న తన కుమార్తె గల్లంతైన ఘటనపై జి. గణేశ్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించిన కేసు నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.



## ఆలస్య జనన, మరణ నమోదు ఇక కఠినం

జనన, మరణాలను ఆలస్యంగా నమోదు చేయించుకునే నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ తీసుకొచ్చిన సవరణ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో 'జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం–2026' అమల్లోకి వచ్చింది. ఇప్పటికే లోక్‌సభ, రాజ్యసభ ఆమోదించిన ఈ బిల్లుకు రాష్ట్రపతి సమ్మతి లభించడంతో చట్టరూపం దాల్చింది. జననం లేదా మరణం జరిగిన తేదీ నుంచి రెండేళ్లు దాటిన తర్వాత నమోదు కోసం దరఖాస్తు చేస్తే ఇకపై ప్రథమ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్ ఉత్తర్వు తప్పనిసరి. ఆలస్య నమోదులో న్యాయ పరమైన పరిశీలనను పెంచడమే ఈ సవరణ ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది. జననం లేదా మరణం జరిగిన ఏడాది తర్వాత.. రెండేళ్లలోపు నమోదు కోసం దరఖాస్తు చేసుకుంటే జిల్లా కలెక్టర్ (డీఎం), సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డీఎం) లేదా అధీకృత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఉత్తర్వు అవసరం. సంబంధిత అధికారి ఘటనకు సంబంధించిన వివరాల నిజానిజాలను పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటారు. నిర్దేశిత రుసుము చెల్లించిన తర్వాతే నమోదు ప్రక్రియ పూర్తవుతుంది.

### సకాలంలోనే నమోదు చేయాలి

1969లో తీసుకొచ్చిన జనన, మరణాల నమోదు చట్టం ప్రకారం ఈ వివరాలను నమోదు చేయడం తప్పనిసరి. జనన, మరణ ధ్రువపత్రాలు వ్యక్తి జననం లేదా మరణాన్ని నిరూపించేందుకు చట్టబద్ధమైన ఆధారాలుగా ఉపయోగపడతాయి. 2023లో ఈ చట్టానికి సవరణలు చేయగా.. అదే ఏడాది అక్టోబర్ 1 నుంచి అవి అమల్లోకి వచ్చా యి. జనన, మరణాల నమోదులో జాప్యాన్ని తగ్గించి.. కీలకమైన ఈ వివరాలను సకాలంలో నమోదు చేసేలా ప్రజలను ప్రోత్సహించడమే తాజా సవరణల ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# ప్రపంచ భద్రతకు భారత్–అమెరికా భాగస్వామ్యం కీలకం

- దోవల్‌తో ఫలప్రదంగా చర్చలు జరిపాం
- అమెరికా రాయబారి సెర్జియో గోర్
- రక్షణ, వాణిజ్యం, ఇంధన భద్రత, కీలక ఖనిజాలపై సహకారం



**న్యూఢిల్లీ:** ప్రపంచ భద్రతకు ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడంలో భారత్‌తో అమెరికా భాగస్వామ్యం కీలకమని అమెరికా రాయబారి సెర్జియో గోర్ అన్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో మంగళవారం ఫలప్రదమైన సమావేశం జరిగిందని, ఇరు దేశాలకు అనేక ఉమ్మడి లక్ష్యాలు ఉన్నాయని తెలిపారు. భారత్–అమెరికా వ్యూహాత్మక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై దోవల్‌తో చర్చించినట్లు గోర్ వెల్లడించారు. అంతకుముందు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీతోనూ ఆయన భేటీ అయ్యారు. రక్షణ, వాణిజ్యం, ఇంధన భద్రత, కీలక ఖనిజాలు తదితర రంగాల్లో సహకార విస్తరణపై చర్చలు జరిగినట్లు సమాచారం.

### వాణిజ్య ఒప్పందంపై ముందడుగు

ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. వాణిజ్యం, రక్షణ, ఇంధన భద్రతతో పాటు కీలక రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని చెప్పారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడి వాణిజ్యం, రక్షణ, ఇంధన భద్రత అంశాలపై చర్చించారు. గతంలో సుంకాలు, హెచ్1బీ వీసా రుసుము పెంపు వంటి అంశాలతో సంబంధాల్లో కొంత ప్రతికూలత ఏర్పడినా.. ఇటీవలి కాలంలో ఇరు దేశాలు సంబంధాలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాయి.

# పైలట్‌కు డ్రగ్ పాజిటివ్!

- నిర్ధారణ పరీక్షలో సైకోయాక్టివ్ పదార్థం గుర్తింపు
- ఇద్దరు పైలట్లను రోస్టర్ నుంచి తప్పించిన డీజీసీఏ

**ప్రజానావ, న్యూఢిల్లీ:** ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిర్ ఇండియా విమానం 300 అడుగుల మేర కిందికి జారిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతుండగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది. విమాన కమాండింగ్ పైలట్ సైకోయాక్టివ్ పదార్థాల నిర్ధారణ పరీక్షలో పాజిటివ్‌గా తేలినట్లు విశ్వసనీయ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. పరీక్షలో గంజాయి వినియోగం ఉన్నట్లు సమాచారం. అయితే విమానం కిందికి జారడానికి ఇదే కారణమని దర్యాప్తు సంస్థలు నిర్ధారించలేదు. ఆగస్టు 4న ఎయిర్‌బస్ ఏ320 విమానం ఫుకెట్ నుంచి ఢిల్లీకి ఏఐ2379 సర్వీసుగా బయలుదేరింది. విమానంలో 145 మంది ఉండగా.. ప్రయాణ సమయంలో ఒక్కసారిగా 300 అడుగుల ఎత్తు కోల్పోయింది. అనంతరం సురక్షితంగా ఢిల్లీలో ల్యాండ్ అయింది. ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు కేబిన్ సిబ్బంది గాయపడ్డారు. ఇద్దరు పైలట్లకు నిర్వహించిన పరీక్షల్లో కమాండింగ్ పైలట్ నమూనా నిర్ధారణ పరీక్షలోనూ పాజిటివ్‌గా తేలింది. దీంతో దర్యాప్తు పూర్తయ్యే వరకు ఇద్దరినీ డీజీసీఏ విధుల రోస్టర్ నుంచి తప్పించింది. విమానంలో తలెత్తిన సాంకేతిక సమస్యలు, హైడ్రాలిక్ లోపాలు, తీవ్ర గాలుల ప్రభావంపైనా దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనకు అసలు కారణం ఇప్పుడే నిర్ధారించలేమని ఏఏఐబీ స్పష్టం చేసింది.

# ఇరాన్ నౌకలపై అమెరికా వేట

- హెచ్చరికలను పట్టించుకోకుండా ముందుకెళ్లిన వాణిజ్య నౌకపై క్షిపణి దాడి
- 'ఎంవీ వెలా నోవా' ఇంజిన్ గది ధ్వంసం
- 55 నౌకలను వెనక్కి మళ్లించిన అమెరికా
- అరేబియా సముద్రంలో 15కుపైగా యుద్ధ నౌకల మోహరింపు



**వాషింగ్టన్:** ఇరాన్ పోర్టులపై విధించిన అమెరికా దిగ్బంధనాన్ని ఉల్లంఘించేందుకు ప్రయత్నించిన ఓ వాణిజ్య నౌకపై అమెరికా సైన్యం కాల్పులు జరిపింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో పనామా జెండాతో ప్రయాణిస్తున్న 'ఎంవీ వెలా నోవా' నౌక అమెరికా హెచ్చరికలను పట్టించుకోకుండా ముందుకు సాగడంతో ఈ చర్య చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ మంగళవారం వెల్లడించింది. అమెరికా సైనిక హెలికాప్టర్ నుంచి నౌక ఇంజిన్ గదిపై క్షిపణులు ప్రయోగించడంతో దాని ఇంజిన్ పనిచేయకుండా నిలిచిపోయిందని తెలిపింది. ఈ ఘటనలో నౌక సిబ్బందికి ఎవరైనా గాయపడ్డారా, ప్రాణనష్టం జరిగిందా అనే వివరాలను కమాండ్ వెల్లడించలేదు. ఇరాన్‌పై విధించిన దిగ్బంధనాన్ని ఉల్లంఘించేందుకు ప్రయత్నించిన 55 వాణిజ్య నౌకలను ఇప్పటివరకు దారి మళ్లించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. నిబంధనలు పాటించని మరో మూడు నౌకలను నిలిపివేసినట్లు పేర్కొంది. మరో రెండు నౌకల్లోకి అమెరికా బలగాలు ప్రవేశించి తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించింది. ఇరాన్‌పై ఒత్తిడి కొనసాగిస్తున్న అమెరికా అరేబియా సముద్ర జలాల్లో భారీగా యుద్ధ నౌకలను మోహరించింది. ప్రస్తుతం రెండు విమాన వాహక నౌకలు, ఒక ఉభయచర దాడి నౌక సహా 15కుపైగా అమెరికా యుద్ధ నౌకలు అక్కడ ఉన్నట్లు సెంట్రల్ కమాండ్ తెలిపింది.

# చంద్రుడిపై భారత్‌కు స్పేస్

- 'మూన్ బేస్'లో భాగస్వామ్యం కావాలని నాసా ఆహ్వానం
- చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో మానవుల శాశ్వత స్థావరమే లక్ష్యం
- ఇస్రోను భాగస్వామిగా చేర్చుకునేందుకు ప్రతిపాదన
- ఆర్టెమిస్ ఒప్పందాల ఆధారంగా సహకారం

**న్యూఢిల్లీ:** చంద్రుడిపై మానవాళి తొలి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిష్ఠాత్మక 'మూన్ బేస్' కార్యక్రమంలో భారత్ భాగస్వామి కావాలని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ఆహ్వానించింది. చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో మానవులు నివసించేందుకు, పనిచేసేందుకు, శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించేందుకు వీలుగా ఈ స్థావరాన్ని నిర్మించాలన్నది నాసా లక్ష్యం. ఈ కార్యక్రమంలో ఇస్రోను భాగస్వామిగా చేర్చుకునేందుకు ఆహ్వానం అందినట్లు భారత్–అమెరికా సంయుక్త ప్రకటన తెలిపింది. సిబ్బందితో కూడిన, సిబ్బంది లేని వరుస అంతరిక్ష యాత్రల ద్వారా చంద్రుడిపై 'మూన్ బేస్'ను నిర్మించనున్నట్లు నాసా తెలిపింది. కొత్త శాస్త్రీయ ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడంతోపాటు.. భవిష్యత్తులో లోతైన అంతరిక్ష పరిశోధనలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. బెంగళూరులో ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగిన భారత్–అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ (సీఎస్‌జేడబ్ల్యూజీ) 9వ సమావేశంలో ఇరు దేశాల అంతరిక్ష సహకారంపై విస్తృతంగా చర్చించారు. ఆర్టెమిస్ ఒప్పందాల కింద ఇప్పటికే కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ ఇస్రోను 'మూన్ బేస్' కార్యక్రమంలో చేర్చుకోవాలని నాసా ఆహ్వానించింది. అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన ఓపెన్ సైంటిఫిక్ డేటాను పరస్పరం పంచుకునే అంశంపైనా చర్చలను ముందుకు తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

### నిసార్ విజయంతో..

గత ఏడాది భారత్–అమెరికా సంయుక్తంగా చేపట్టిన నాసా–ఇస్రో సింథటిక్ అపర్చర్ రాడార్ (నిసార్) ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో తదుపరి దశలో సహకారాన్ని విస్తరించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. శాస్త్రీయ పరిశోధనలు, మానవ అంతరిక్ష యాత్రలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధిలో కలిసి పనిచేయాలని అంగీకరించాయి. సీఎస్‌జేడబ్ల్యూజీ సమావేశంలో ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్, అమెరికా రాయబారి సెర్గియో గోర్ ప్రారంభ సమావేశంలో ప్రసంగించారు. ద్వైపాక్షిక అంతరిక్ష సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వారు వివరించారు. అంతరిక్ష కార్యకలాపాల దీర్ఘకాలిక సుస్థిరతకు సంబంధించిన ఐక్యరాజ్యసమితి మార్గదర్శకాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఇరుదేశాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి.

# ఎఫ్‌సీఆర్ఏ బిల్లుపై జేపీసీకి యోచన

**పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త కమిటీకి పంపే అంశాన్ని పరిశీలిస్తున్న కేంద్రం**



**న్యూఢిల్లీ:** విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు–2026ను పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త కమిటీ (జేపీసీ)కి పంపే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ మేరకు బుధవారం లోక్‌సభలో తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు బిల్లును ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే సహా పలు ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు రాజ్యసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో ఎఫ్‌సీఆర్ఏ బిల్లు అంశాన్ని కాంగ్రెస్, టీఎంసీ నేతలు ప్రస్తావించారు. అయితే అది సమావేశ అజెండాలో లేదు. బిల్లును రాజ్యసభలో ఎప్పుడు చేపడతారని వారు ప్రశ్నించగా.. తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం సమాధానమిచ్చింది. బిల్లును పూర్తిగా ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్, టీఎంసీ డిమాండ్ చేశాయి. డీఎంకే కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అయితే బిల్లును మరింత సమగ్రంగా పరిశీలించేందుకు ఉభయ సభల సంయుక్త కమిటీకి పంపవచ్చని బీజేడీ సూచించినట్లు సమాచారం.

### ఎన్‌జీవోలపై మరింత పర్యవేక్షణ

'ది ఫారిన్ కాంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్) అమెండ్‌మెంట్ బిల్–2026'ను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 25న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దేశంలోని స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జీవోలు), విదేశీ నిధులపై ప్రభుత్వ పర్యవేక్షణను మరింత కఠినతరం చేయడం బిల్లు ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఎన్‌జీవోకు ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రద్దయితే.. ఆ సంస్థకు చెందిన ఆస్తులను నిర్వహించి, అవసరమైతే విక్రయించేందుకు ప్రత్యేక అధికార సంస్థను ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. అయితే బిల్లులోని కొన్ని నిబంధనలు క్రైస్తవ ఎన్‌జీవోలు, మైనారిటీలు నిర్వహించే సామాజిక సంక్షేమ, విద్యా సంస్థలకు అందే చట్టబద్ధమైన విదేశీ నిధులను అడ్డుకునేలా ఉన్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిల్లు మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నదని విమర్శిస్తున్నాయి. ప్రతిపాదిత చట్టం ఏ మతానికీ ప్రత్యేకంగా వర్తించదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశీ విరాళాల నియంత్రణ, పారదర్శకత కోసమే ఈ బిల్లును తీసుకొస్తున్నామని పేర్కొంది.

### బిల్లులపై చర్చకు సమయం

రాజ్యసభ బీఏసీ సమావేశానికి ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అధ్యక్షత వహించారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, సభా నాయకుడు జేపీ నడ్డా, ప్రతిపక్ష నేతలు జైరాం రమేశ్ (కాంగ్రెస్), తిరుచ్చి శివ (డీఎంకే), సస్మిత్ పాత్ర (బీజేడీ) పాల్గొన్నారు. సమావేశంలో గనులు–ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు–2026పై చర్చకు రెండు గంటలు, ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లుకు రెండు గంటలు, జాతీయ సహకార అభివృద్ధి సంస్థ సవరణ బిల్లుకు మూడు గంటలు, కేరళ (పేరు మార్పు) బిల్లుకు గంటన్నర సమయం కేటాయించారు.

# చమురు సుంకాలపై మోదీ, ట్రంప్ చర్చలే కీలకం

- భారత్–అమెరికా వివాదాన్ని ఇరువురు నేతలే పరిష్కరించుకుంటారు
- వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో

**వాషింగ్టన్:** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అమెరికా విధించనున్న సుంకాలతో తలెత్తిన వివాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం చర్చించుకుని పరిష్కరించుకుంటారని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో అన్నారు. ఇరువురు నేతల మధ్య మంచి పని సంబంధాలు ఉన్నాయని, ఈ వ్యవహారంలో తాను జోక్యం చేసుకోబోనని స్పష్టం చేశారు. రష్యా చమురు కొనుగోలు చేసే ప్రధాన ఐదు దేశాలపై 100 శాతం సుంకాలు విధించేందుకు అమెరికా అధ్యక్షుడికి అధికారం కల్పించే బిల్లును ఇటీవల సెనెట్ ఆమోదించింది. 2022లో ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారీగా పెంచిందని నవారో ఆరోపించారు. రష్యా చమురు వాణిజ్యానికి భారత్‌ను దూరం చేయడంలో తన వంతు పాత్ర ఉందని పేర్కొంటూ.. తుది నిర్ణయం మోదీ, ట్రంప్ చర్చల ద్వారానే జరుగుతుందని తెలిపారు.



## అఫ్గాన్‌తో భారత్ టీ20 సిరీస్

### బీసీసీఐతో సంప్రదింపుల అనంతరం అధికారిక ప్రకటన

**న్యూఢిల్లీ:** భారత్–అఫ్గానిస్థాన్ మధ్య మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌కు రంగం సిద్ధమైంది. అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) ఆతిథ్యంలో సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు సమాచారం. మూడు మ్యాచ్‌లకూ న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదిక కానుంది. ఈ మేరకు ఏసీబీ, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో సంప్రదింపుల అనంతరం తేదీలు, వేదికలను ఖరారు చేసినట్లు 'క్రిక్‌బజ్' నివేదించింది. భారత్–అఫ్గానిస్థాన్ పర్యటన సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు కొనసాగుతుందని ఏసీబీ సీఈఓ నసీబ్ ఖాన్ వాణిజ్య భాగస్వాములకు పంపిన లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. మ్యాచ్‌ల తేదీలు, వేదికలపై బీసీసీఐతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఈ సిరీస్‌కు సంబంధించి బీసీసీఐ, ఏసీబీ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది.

#### బంగ్లా పర్యటనపై సందిగ్ధత

సెప్టెంబర్ 1 నుంచి 13 వరకు బంగ్లాదేశ్‌లో భారత్ ఆరు వైట్‌బాల్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అయితే సెప్టెంబర్ 13 నుంచే అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానున్నట్లు సమాచారం రావడంతో బంగ్లాదేశ్ పర్యటనపై సందిగ్ధత నెలకొంది. ఈ రెండు పర్యటనల షెడ్యూల్‌పై బీసీసీఐ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## క్రికెటర్ అభిషేక్ పోరెల్ అరెస్టు

- వైద్య విద్యార్థినితో మూడున్నరేళ్లుగా ప్రేమాయణం
- పెళ్లి హామీతో లైంగిక సంబంధం
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు
- కోర్టు ఆదేశాలతో అదుపులోకి





**కోల్‌కతా:** బెంగాల్ క్రికెటర్, ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన అభిషేక్ పోరెల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి తనతో లైంగిక సంబంధం పెట్టుకున్నాడని కర్ణాటకకు చెందిన ఓ మహిళా వైద్య విద్యార్థిని చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. హుగ్లీ జిల్లా మొగ్రా పోలీసులు సోమవారం అర్ధరాత్రి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం చిన్సురా కోర్టులో హాజరుపరచనున్నట్లు హుగ్లీ (రూరల్) ఎస్పీ కున్వర్ భూషణ్ సింగ్ తెలిపారు. కర్ణాటకకు చెందిన వైద్య విద్యార్థిని జూన్ 23న మొగ్రా పోలీస్ స్టేషన్‌లో పోరెల్‌పై ఫిర్యాదు చేసింది. తామిద్దరం సుమారు మూడున్నరేళ్లుగా సంబంధంలో ఉన్నామని, పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నామని ఆమె పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి తనతో లైంగిక సంబంధం పెట్టుకున్నాడని ఫిర్యాదులో ఆరోపించింది. ఫిర్యాదు అందిన అనంతరం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోరెల్ చందన్నగర్‌లోని నివాసానికి పలుమార్లు వెళ్లినా ఆయన అక్కడ కనిపించలేదని పోలీసులు తెలిపారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు సోమవారం రాత్రి ఆయనను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 69తోపాటు సమాచార సాంకేతిక చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# హర్మన్‌ప్రీత్‌లో నా ఆటను చూస్తున్నా!

- ప్రపంచకప్‌లో భారత్‌కు అతడే 'ట్రంప్ కార్డ్'
- దూకుడు, ఫిట్‌నెస్‌తో కెప్టెన్ రాణిస్తున్నాడు: మాజీ డ్రాగ్ ఫ్లికర్ జుగ్‌రాజ్ సింగ్









**న్యూఢిల్లీ:** భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్‌లో తన ఆటతీరును చూస్తున్నానని మాజీ డ్రాగ్ ఫ్లికర్ జుగ్‌రాజ్ సింగ్ అన్నారు. ఈ వారంలో ప్రారంభం కానున్న ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్‌లో హర్మన్‌ప్రీత్ భారత్‌కు 'ట్రంప్ కార్డ్'గా నిలుస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇద్దరూ జలంధర్‌లోని సుర్జీత్ హాకీ అకాడమీ నుంచే వెలుగులోకి రావడం విశేషం. హర్మన్‌ప్రీత్ దూకుడైన ఆటతీరు తనను గుర్తు చేస్తోందని జుగ్‌రాజ్ చెప్పారు. ''అతడి ఆటశైలి నాదిలాగే ఉంటుంది. అతడి దూకుడు చూస్తుంటే నా ఆట గుర్తుకొస్తుంది. అతడిని చూస్తున్నప్పుడు మళ్లీ మైదానంలో నేనే ఆడుతున్నట్లు అనిపిస్తుంది'' అని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని అత్యుత్తమ ముగ్గురు డ్రాగ్ ఫ్లికర్లలో హర్మన్‌ప్రీత్ ఒకడని జుగ్‌రాజ్ పేర్కొన్నారు. టోక్యో ఒలింపిక్స్ తర్వాత అతడి ఆట మరింత మెరుగైందన్నారు. కీలక సమయాల్లో జట్టుకు అండగా నిలిచే ఆటగాడే 'ట్రంప్ కార్డ్' అని, ఆ సామర్థ్యం హర్మన్‌ప్రీత్‌కు ఉందని చెప్పారు. ఫిట్‌నెస్‌పై కూడా అతడు ప్రత్యేకంగా దృష్టి పెట్టాడని తెలిపారు.

#### వీడియో విశ్లేషణ కీలకం

హర్మన్‌ప్రీత్ ఆటను మరింత మెరుగుపర్చేందుకు వీడియో విశ్లేషణ ఎంతో ఉపయోగపడుతుందని జుగ్‌రాజ్ అన్నారు. స్లోమోషన్‌లో ప్రత్యర్థి గోల్‌కీపర్, రషర్ల కదలికలను పరిశీలించడం ద్వారా డ్రాగ్ ఫ్లికర్ తన లోపాలను గుర్తించగలడని చెప్పారు. హర్మన్‌ప్రీత్ కూడా తన ఆటలోని లోపాలను చెప్పాలని తరచూ కోరుతుంటాడని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో విజయాలు సాధించినప్పటికీ హర్మన్‌ప్రీత్ ఇంకా నేర్చుకోవాలనే తపనతో ఉండటం అతడి ప్రత్యేకత అని జుగ్‌రాజ్ ప్రశంసించారు. రెండు ఒలింపిక్ పతకాలు సాధించినా ఎంతో ఒదిగి ఉంటాడని, తరానికి ఒకసారి మాత్రమే లభించే ఆటగాడని కొనియాడారు.

#### డ్రాగ్ ఫ్లిక్ ఒక్కటే సరిపోదు

ప్రస్తుత హాకీలో కేవలం డ్రాగ్ ఫ్లిక్‌పై ఆధారపడటం సరిపోదని జుగ్‌రాజ్ సూచించారు. గోల్స్ సాధించడంతో పాటు సహచరులకు అవకాశాలు కల్పించడం, జట్టుతో సమన్వయంగా ఆడటం కూడా కీలకమన్నారు. ప్రపంచకప్‌లో ప్రత్యర్థి జట్లు హర్మన్‌ప్రీత్ పెనాల్టీ కార్నర్ వ్యూహాలను పూర్తిగా విశ్లేషిస్తాయని, అందువల్ల అతడు కొత్త పద్ధతులతో వారిని ఆశ్చర్యపరచాలని సూచించారు. పెనాల్టీ కార్నర్‌లో పుషర్, స్టాపర్, ఫ్లికర్ మధ్య సమన్వయం అత్యంత కీలకమని చెప్పారు. ముగ్గురి మధ్య సరైన అవగాహన ఉంటే గోల్‌ను అడ్డుకోవడం ప్రత్యర్థులకు కష్టమవుతుందని పేర్కొన్నారు. ఇతర డ్రాగ్ ఫ్లికర్ల పాత్ర కూడా ముఖ్యమేనని, వారితో ప్రత్యర్థులకు అనూహ్య పరిస్థితులు సృష్టించవచ్చని అన్నారు.

#### 50 ఏళ్ల నిరీక్షణకు తెరపడేనా?

ప్రస్తుత భారత జట్టు ప్రపంచకప్‌లో పతకం సాధించే సత్తా కలిగి ఉందని జుగ్‌రాజ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ''ఒలింపిక్ పతకాన్ని హర్మన్‌ప్రీత్ అందించాడు. కామన్వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడలు, ఆసియా కప్ పతకాలు కూడా మన ఖాతాలో ఉన్నాయి. ఇప్పుడు ప్రపంచకప్ పతకం మాత్రమే మిగిలింది. ఈసారి ఆ లోటు తీరుతుందని ఆశిస్తున్నాం'' అని చెప్పారు. జట్టు బాగా సన్నద్ధమైందని, ఆటగాళ్ల మధ్య మంచి సమన్వయం కనిపిస్తోందని పేర్కొన్న జుగ్‌రాజ్.. భారత జట్టు 50 ఏళ్ల ప్రపంచకప్ పతకం నిరీక్షణకు తెరదించే సామర్థ్యం కలిగి ఉందన్నారు. జుగ్‌రాజ్ 2001 జూనియర్ ప్రపంచకప్‌లో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. అయితే 2003లో జలంధర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంతో ఆయన అంతర్జాతీయ కెరీర్ అర్ధంతరంగా ముగిసింది. ప్రస్తుతం గురుదాస్‌పూర్ ఎస్పీగా పనిచేస్తున్న ఆయన హర్మన్‌ప్రీత్ ఆటను ఎప్పటికప్పుడు గమనిస్తూ సలహాలు ఇస్తున్నారు.

## డైట్ చార్ట్ చించేశానని ఎన్‌సీఏ నుంచి పంపేశారు

- సరైన ఆహారం అందక ప్రశ్నించినందుకే చర్యలు
- 2000 నాటి చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్న హర్భజన్ సింగ్
- ఆటగాళ్ల హక్కుల కోసం నిలబడటమే తన తప్పని వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తన క్రికెట్ కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న చేదు అనుభవాన్ని తాజాగా గుర్తుచేసుకున్నాడు. 2000లో బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) నుంచి తనను బయటకు పంపడానికి గల కారణాన్ని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. ఆటగాళ్లకు నిర్దేశించిన డైట్ ప్రకారం ఆహారం అందడం లేదని ప్రశ్నించినందుకే తనపై చర్యలు తీసుకున్నారని తెలిపాడు. ఎన్‌సీఏలో శిక్షణ పొందిన తొలి బ్యాచ్ ఆటగాళ్లలో హర్భజన్ కూడా ఉన్నాడు. ''ఎన్‌సీఏ నుంచి నన్ను బయటకు పంపించారు. అందులో నా తప్పేమీ లేదు. ఆటగాళ్ల కోసం ప్రత్యేక డైట్ చార్ట్ రూపొందించారు. కానీ అందుకు అనుగుణంగా ఆహారం అందించేవారు కాదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. దీంతో ఒకరోజు ఆ డైట్ చార్ట్‌ను చించేశాను. నేను చేసిన ఏకైక తప్పు అదే'' అని భజ్జీ చెప్పాడు. 'నా హక్కుల కోసం నేను పోరాడాను. నేను ప్రశ్నించకపోయి ఉంటే ఇప్పటికీ అదే డైట్ ప్లాన్ కొనసాగుతూ ఉండేదేమో. అప్పట్లో బీసీసీఐలో తమ మాటను ప్రశ్నించే వారిని సహించని కొందరు వ్యక్తులు ఉండేవారు' అని హర్భజన్ పేర్కొన్నాడు.

## గంగూలీ దంపతులకు బెదిరింపులు

- హత్య చేస్తామంటూ ఆరు నెలలుగా వరుసగా లేఖలు
- పోలీసులకు ఫిర్యాదు.. కొరియర్ ద్వారా లేఖలు పంపినట్లు గుర్తింపు



**కోల్‌కతా:** భారత మాజీ క్రికెట్ కెప్టెన్ సౌరభ్ గంగూలీ, ఆయన సతీమణి డోనా గంగూలీని హత్య చేస్తామంటూ బెదిరింపు లేఖలు రావడం కలకలం రేపింది. గత ఆరు నెలలుగా ఇలాంటి లేఖలు వస్తున్నట్లు గంగూలీ కుటుంబసభ్యులు తెలిపారు. తొలుత ఆకతాయిల చర్యగా భావించి పెద్దగా పట్టించుకోకపోయినా.. పదేపదే బెదిరింపులు రావడంతో పోలీసులను ఆశ్రయించారు. ఇటీవల వచ్చిన లేఖలో గంగూలీ దంపతులతో పాటు వారి సన్నిహితులకు కూడా హాని చేస్తామని బెదిరించినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు గంగూలీ కుటుంబానికి భద్రత కల్పించాలని కోరారు. బెదిరింపు లేఖలను కొరియర్ ద్వారా పంపినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించిన పోలీసులు.. లేఖలో పేర్కొన్న ఫోన్ నంబర్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. గంగూలీ, ఆయన కుటుంబసభ్యుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.





## కొత్త యూట్యూబర్లకు కష్టకాలం

### మానిటైజేషన్ వాచ్‌టైమ్‌ను పెంపు





**న్యూఢిల్లీ :** కొత్త యూట్యూబర్లకు కష్టకాలం వచ్చింది. మానిటైజేషన్‌కు అవసరమైన వాచ్‌టైమ్‌ను ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం యూట్యూబ్ రెట్టింపు చేసింది. క్రియేటర్లు వీడియోల ద్వారా డబ్బు సంపాదించడానికి వీలు కల్పించే యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రావ్‌లో చేపట్టిన మార్పుల్లో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు యూట్యూబ్ బ్లాగ్‌పోస్ట్ వెల్లడించింది. ఇంతకు ముందు.. డబ్బు సంపాదించాలంటే కంటెంట్ క్రియేటర్లు గత 365 రోజుల్లో 4,000 వాచ్ అవర్స్ లేదా 10 మిలియన్ షార్ట్స్ వ్యూస్ ఉండాలి. అయితే.. కొత్త నిబంధనల ప్రకారం గత 365 రోజుల్లో 8,000 క్వాల్గి÷డ్ వాచ్ అవర్స్ లేదా గత 90 రోజుల్లో 20 మిలియన్ల షార్ట్స్ వీక్షణలు ఉండాలి. 1,000 మంది సబ్‌స్క్రైబర్‌లు ఉండాలనే నియమంలో మాత్రం ఎటువంటి మార్పు లేదని తెలిపింది. అయితే ఇప్పటి యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రావ్‌లో ఉన్న క్రియేటర్లపై ఈ ప్రభావం ఉండబోదని పేర్కొంది. ప్రోగ్రావ్‌లో ఇప్పటి 3 మిలియన్లకు పైగా కంటెంట్ క్రియేటర్లు ఉన్నారు. ఈ నిబంధనలు 2027 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు యూట్యూబ్ వెల్లడించింది. యూట్యూబ్ షార్ట్స్ ద్వారా వచ్చే ఆదాయం కోసం డా ఈ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం కొత్త నిబంధన ప్రవేశపెట్టింది. షార్ట్స్‌పై వచ్చే ప్రకటనలు, సబ్‌స్క్రిప్షన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచుకోవడానికి అర్హత పొందాలంటే క్రియేటర్లు 90రోజుల వ్యవధిలో 10 మిలియన్ల షార్ట్స్ వ్యూస్ కలిగి ఉండాలి. ఈ నిబంధన కొత్త క్రియోటర్లతో పాటు ఇప్పటి ఉన్నవారికి డా వర్తిస్తుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1నుంచి ఇది అమల్లోకి వస్తుంది. యూట్యూబ్ ప్రీమియం అందుబాటులో ఉన్న అన్ని దేశాలకు ఈ ప్లాట్‌ఫావ్ ప్రీమియం లైట్ సేవలను విస్తరించింది. ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా అందులోని కంటెంట్‌ను నిరంతరాయంగా చూడొచ్చు. ప్రీమియం లైట్ సేవలు భారత్‌లోనూ అందుబాటులో ఉన్నాయి. దీని ధర నెలకు రూ.89 కాగా, స్టాండర్డ్ ప్లాన్ ధర రూ. 149. దీనివల్ల క్రియేటర్లు అధిక ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని పేర్కొంది. యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రొగ్రావ్‌లో 2018 తర్వాత తొలిసారిగా భారీ మార్పులు చేయనున్నట్లు యూట్యూబ్ ప్రకటించింది. ఎ÷—లాట్‌ఫావ్‌లో క్రియేటర్ల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో మానిటైజేషన్ నిబంధనలను కంపెనీ మరింత కఠినతరం చేసింది. షార్ట్స్, ప్రకటనలు, ప్రీమియం ఆదాయ భాగస్వామ్యానికి సంబంధించిన నిబంధనలను సవరించింది. యూట్యూబ్ షాపింగ్‌లో నిర్దిష్ట మైలురాళ్లు చేరిన వారికి బోనస్లు, బ్రాండ్ డీల్స్‌కు ప్రోత్సాహకాలు, ట్రెండింగ్ కంటెంట్ ప్రారంభించి అభివృద్ధి చేసే వారికి అదనపు ఆదాయ అవకాశాలు కల్పించనుంది. యూట్యూబ్ ప్రీమియం లైట్‌ను అందుబాటులో ఉన్న అన్ని దేశాలకు విస్తరించనున్నారు. ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ద్వారా వచ్చే నికర ఆదాయంలో 30 శాతం, ప్రీమియం లైట్ ద్వారా వచ్చే ఆదాయంలో 60 శాతం క్రియేటర్ల కోసం టాయిస్తారు.

## చమురు సెగ.. మార్కెట్లకు దెబ్బ!

- 388 పాయింట్లు పతనమైన సెన్సెక్స్.. 112 పాయింట్లు తగ్గిన నిఫ్టీ





**ముంబై:** అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు భారీగా పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా–ఇరాన్ చర్చలపై నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో చమురు ధరలు పెరగడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. దీంతో బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలను చవిచూశాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 388.19 పాయింట్లు (0.49 శాతం) నష్టపోయి 78,154.25 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఒక దశలో 494.18 పాయింట్లు పతనమై 78,048.26కు చేరింది. 50 షేర్ల ఎన్ఎస్ఈ నిఫ్టీ 112.10 పాయింట్లు (0.46 శాతం) తగ్గి 24,471.70 వద్ద ముగిసింది. ప్రపంచ చమురు బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ధర 2.18 శాతం పెరిగి బ్యారెల్‌కు 89.63 డాలర్లకు చేరింది. హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు, అమెరికా–ఇరాన్ ఒప్పందంపై ఆశలు సన్నగిల్లడం వంటి పరిణామాలు చమురు ధరలను 90 డాలర్ల దిశగా నడిపించాయని నిపుణులు తెలిపారు. దీంతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడిందన్నారు. సెన్సెక్స్ ప్యాక్‌లో అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, భారతి ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ షేర్లు నష్టపోయాయి. ఎటర్నల్, ఇన్ఫోసిస్, టైటన్, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ షేర్లు లాభాల్లో నిలిచాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.38 శాతం లాభపడగా.. మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ స్వల్పంగా 0.01 శాతం తగ్గింది. రంగాల వారీగా హాస్పిటల్స్, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, కమోడిటీస్, పవర్, క్యాపిటల్ గూడ్స్ సూచీలు నష్టపోయాయి. సోమవారం విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) రూ.1,974.76 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీల గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు రోజు సెన్సెక్స్ 43.27 పాయింట్లు, నిఫ్టీ 13.15 పాయింట్లు లాభపడ్డాయి.

## ఎల్అండ్‌టీ డేటా వ్యాపారం బదిలీ





**న్యూఢిల్లీ:** ఇంజినీరింగ్, మౌలిక వసతుల దిగ్గజం లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్‌టీ) తన డేటా సెంటర్, క్లౌడ్ సర్వీసుల వ్యాపారాన్ని అనుబంధ సంస్థ వ్యోమా.ఏఐ లిమిటెడ్‌కు బదలీ చేయనుంది. ఇందుకు రూ.1,400 కోట్ల విలువైన ఒప్పందం కుదిరినట్లు ఎల్అండ్‌టీ మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. వ్యాపార బదలీని 'స్లంప్ సేల్' విధానంలో కొనసాగుతున్న వ్యాపారంగా (గోయింగ్ కన్సర్న్) నిర్వహించనున్నారు. తుది సర్దుబాట్లకు లోబడి ఉండే ఈ లావాదేవీలో నగదు చెల్లింపులకు బదులుగా వ్యోమా.ఏఐ.. ఒక్కోటి రూ.100 ముఖ విలువ కలిగిన పూర్తిగా చెల్లించిన ఈక్విటీ షేర్లను ఎల్అండ్‌టీకి జారీ చేయనుంది. స్వతంత్ర మదింపుదారు నిర్ణయించే విలువ ఆధారంగా షేర్ల సంఖ్య ఖరారవుతుంది. ఎల్అండ్‌టీ, వ్యోమా.ఏఐ, ఎల్‌టీ నెట్‌వర్క్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎల్‌టీఎన్ఎస్‌పీఎల్) మధ్య మరో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఎల్‌టీఎన్ఎస్‌పీఎల్‌లో ఎల్అండ్‌టీకి ఉన్న మొత్తం ఈక్విటీ వాటాను రూ.30 కోట్లకు వ్యోమా.ఏఐకి బదలీ చేయనున్నారు. రెండు లావాదేవీలు సంబంధిత ఒప్పందాల్లోని షరతుల అమలుకు లోబడి పూర్తవుతాయని సంస్థ తెలిపింది.

## రెండున్నర నెలల గరిష్ఠానికి పసిడి ధర

- రూ.1,57,200కు చేరిన 10 గ్రాముల బంగారం
- వరుసగా ఆరో సెషన్‌లోనూ జోరు
- ఆరు రోజుల్లో రూ.9,800 పెరుగుదల
- రూ.2.42 లక్షలకు చేరిన కిలో వెండి



న్యూఢిల్లీ: దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధర పరుగులు కొనసాగిస్తోంది. వరుసగా ఆరో సెషన్‌లోనూ ధర పెరగడంతో మంగళవారం 10 గ్రాముల 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి రూ.1,57,200కు చేరింది. సోమవారం ధరతో పోలిస్తే రూ.1,200 పెరిగింది. దీంతో బంగారం రెండు నెలల గరిష్ఠ స్థాయికి చేరినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. ఆగస్టు 3న 10 గ్రాముల బంగారం రూ.1,47,400గా ఉండగా.. ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూ.9,800 పెరిగింది. అంటే 6.65 శాతం వృద్ధి నమోదైంది. జూన్ 12న రూ.1,56,900 వద్ద ఉన్న ధరతో పోలిస్తే ప్రస్తుత ధర మరోసారి ఆ స్థాయిని అధిగమించింది. వెండి ధర కూడా భారీగా పెరిగింది. మంగళవారం కిలోకు రూ.2,000 పెరిగి రూ.2,42,000కు చేరింది. దీంతో రెండు నెలలకు పైగా గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. ఏప్రిల్ 30న కిలో వెండి రూ.2,42,700 వద్ద ట్రేడైంది.

#### ద్రవ్యోల్బణ గణాంకాలపై దృష్టి

అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడులుగా భావించే బంగారం వైపు మొగ్గుచూపుతున్నారని మార్కెట్ నిపుణులు తెలిపారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తదుపరి నిర్ణయాలకు ఈ గణాంకాలు కీలక సంకేతాలు ఇవ్వనున్నాయి. పారిశ్రామిక డిమాండ్, ఇన్వెస్టర్ల సానుకూల సెంటిమెంట్‌తో వెండికీ మద్దతు లభిస్తోందని నిపుణులు పేర్కొన్నారు.

#### అంతర్జాతీయ మార్కెట్‌లో స్వల్ప తగ్గుదల

అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ 0.38 శాతం తగ్గి ఔన్సుకు 4,373.43 డాలర్ల వద్ద ట్రేడైంది. వెండి ధర దాదాపు 1.3 శాతం తగ్గి ఔన్సుకు 64.90 డాలర్లకు చేరింది. ప్రారంభంలో బంగారం 4,435 డాలర్ల వరకు పెరిగినా.. ముడిచమురు ధరలు పెరగడంతో ఆ లాభాలను కోల్పోయింది. హార్ముజ్ జలసంధిపై కొనసాగుతున్న ఉద్రిక్తతలు ముడిచమురు ధరలకు ఊతమిస్తూ మార్కెట్లలో అనిశ్చితిని పెంచుతున్నాయి.

## అంబానీలదే ధనిక కుటుంబం

- ముకేశ్ అంబానీ కుటుంబ సంపద రూ.25.8 లక్షల కోట్లు
- మొదటి తరం వ్యాపారాల్లో అదానీ టాప్
- దేశంలోని 300 కుటుంబ వ్యాపారాల విలువ రూ.138 లక్షల కోట్లు
- వెల్లడించిన హురున్ నివేదిక



**ముంబై:** భారత్‌లో అత్యంత సంపన్న వ్యాపార కుటుంబంగా ముకేశ్ అంబానీ కుటుంబం తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. 2026లో అంబానీ కుటుంబ సంపద 8.5 శాతం తగ్గి రూ.25.8 లక్షల కోట్లకు చేరినప్పటికీ.. దేశంలోనే అత్యంత విలువైన కుటుంబ వ్యాపారంగా నిలిచిందని '2026 బార్క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యుబుల్ ఫ్యామిలీ బిజినెసెస్' నివేదిక వెల్లడించింది. అహ్మదాబాద్‌కు చెందిన గౌతమ్ అదానీ కుటుంబం రూ.19.6 లక్షల కోట్ల సంపదతో మొదటి తరం వ్యాపార కుటుంబాల్లో అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం జాబితాలో అంబానీల తర్వాత రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఎయిర్‌టెల్ ప్రమోటర్ సునీల్ భారతి మిట్టల్ రూ.12.1 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో, మొదటి తరం కుటుంబాల్లో రెండో స్థానంలో నిలిచారు. కుమార్ మంగళం బిర్లా రూ.8.14 లక్షల కోట్ల సంపదతో ఆ తర్వాతి స్థానంలో ఉన్నారు. దేశంలోని 300 అగ్ర కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ రూ.138 లక్షల కోట్లుగా ఉందని హురున్ ఇండియా తెలిపింది. ఇది 1.46 ట్రిలియన్ డాలర్లకు సమానం. గత రెండేళ్లలో ఈ కుటుంబ వ్యాపారాలు రోజుకు సగటున రూ.4,076 కోట్ల విలువను జోడించాయని నివేదిక పేర్కొంది.

### అహుజాల సంపద 352 శాతం పెరుగుదల

మూడేళ్లలో అత్యధిక సంపద వృద్ధిని శాహీ ఎక్స్‌పోర్ట్స్‌కు చెందిన అహుజా కుటుంబం నమోదు చేసింది. వారి సంపద 352 శాతం పెరిగి రూ.37,500 కోట్లకు చేరింది. గార్వేర్ హై–టెక్ ఫిల్మ్స్‌కు చెందిన శశికాంత్ భాలచంద్ర గార్వేర్ కుటుంబం 300 శాతం సంపద వృద్ధితో జాబితాలో ఏకంగా 61 స్థానాలు ఎగబాకింది. మూడేళ్లలో సంపూర్ణంగా అత్యధిక విలువను సృష్టించిన కుటుంబంగా జిందాల్ కుటుంబం నిలిచింది. ఈ కాలంలో రూ.3.3 లక్షల కోట్ల సంపదను జోడించి మొత్తం సంపదను రూ.8.02 లక్షల కోట్లకు పెంచుకుంది.



# ఆమిర్‌తో గొడవ ఏమీ లేదు!

బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ నిర్మాణ సంస్థ రూపొందించిన 'బట్వారా 1947' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వం వహించారు. ప్రీతి జింటా, షబానా ఆజ్మీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచగా.. ఈ చిత్రం ఈ నెల 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న ప్రమోషన్ కార్యక్రమాల్లో చోటుచేసుకున్న ఓ చిన్న ఘటన ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఓ కార్యక్రమంలో ప్రీతి జింటా, ఆమిర్ ఖాన్‌ను పట్టించుకోకుండా వెళ్లిపోయారంటూ ఓ వీడియో వైరల్ కావడంతో ఇద్దరి మధ్య ఏదో విభేదం ఉందంటూ ప్రచారం మొదలైంది. తాజాగా ఈ వీడియోపై ప్రీతి జింటా స్పందిస్తూ ఆ ప్రచారానికి తెరదించారు. కేవలం క్లిక్‌బైట్ కోసం ఒక ఘటనను వక్రీకరించి చూపించడం సరికాదని ఆమె అన్నారు. తాను లోపల కొన్ని షాట్లు చిత్రీకరించాల్సి ఉండటంతో పాటు 'బట్వారా 1947' ప్రమోషన్ కోసం ఫ్లైట్ అందుకోవాలనే తొందరలో ఉన్నానని, అందుకే ఆమిర్ ఖాన్‌ను గమనించలేకపోయానని వివరించారు. అంతేకానీ, ఆయనను కావాలనే పట్టించుకోలేదనడం పూర్తిగా తప్పని స్పష్టం చేశారు. ఆమిర్ పట్ల తనకు ఎంతో ప్రేమ, గౌరవం ఉన్నాయని చెప్పిన ప్రీతి.. చిన్న విషయాలను ఆధారంగా చేసుకుని ప్రతికూల ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి ప్రచారాల కోసం తాను ఆగి ఫొటోలు దిగుతానని మాత్రం ఆశించవద్దంటూ ఆమె కాస్త ఘాటుగానే స్పందించారు. దీంతో వైరల్ వీడియో వెనుక ఎలాంటి విభేదాలు లేవని, అదంతా సందర్భాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం వల్లే జరిగిందని స్పష్టమైంది.

# మహేశ్ బాబు ఏఐ వీడియో షేర్ చేసి వంగా

ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షేర్ చేసిన మహేశ్ బాబు ఏఐ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. సూపర్ స్టార్ పుట్టినరోజు సందర్భంగా అందరూ విషెస్ చెప్పగా.. సందీప్ ఓ ఏఐ వీడియోతో శుభాకాంక్షలు తెలిపారు. దీనికి మహేశ్ డా ఫిదా అయ్యారు. దివంగత లెజెండరీ నటుడు కృష్ణ 'కిరాయి కోటిగాడు' సినిమాలో చెప్పిన ఐకానిక్ డైలాగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో సందీప్ రీక్రియేట్ చేశారు. ఈ వీడియోతో



వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాపై గతంలో జరిగిన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ప్రచారం పొందిన 'డెవిల్' ప్రాజెక్ట్‌పై సందీప్ హింట్ ఇచ్చారా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక తనకు బర్త్‌డే విషెస్ చెప్పిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మహేశ్ పోస్ట్ పెట్టారు. 'వారణాసి' తనకెంతో ప్రత్యేకమైన చిత్రమని పేర్కొన్నారు. ఆ సినిమా విడుదల కోసం తానెంతో ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అభిమానులంతా గర్వపడేలా 'వారణాసి' ఉంటుందన్నారు.

# వారణాసిలో హన్మంతుడిగా రామ్‌చరణ్?

దర్శకధీరుడు రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. 'ఆర్‌ఆర్‌ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తర్వాత రాజమౌళి రూపొందిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన మల్టీస్టారర్ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ చిత్రంగా రూపొందుతున్న 'వారణాసి'లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ స్థాయిలో అడ్వెంచర్, యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పలు కాలాలను, విభిన్న ప్రపంచాలను కలిపి రాజమౌళి సరికొత్త అనుభూతిని అందించబోతున్నట్లు ఇప్పటి ప్రచారం జరుగుతోంది. 'వారణాసి' కథలో త్రేతాయుగానికి సంబంధించిన కీలకమైన ఎపిసోడ్ ఉంటుందని, ఆ భాగంలో మహేశ్‌బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారని ఇప్పటి వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. శ్రీరాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపించే ఎపిసోడ్‌లో హనుమంతుడిగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.అయితే ఈ విషయంపై ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మొదట హనుమంతుడి పాత్ర కోసం మరో నటుడి పేరు వినిపించినప్పటికీ, ఈ పాత్రకు కావాల్సిన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్ దృష్ట్యా రామ్ చరణ్ అయితే మరింత ప్రభావవంతంగా ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. 'ఆర్‌ఆర్‌ఆర్'లో అల్లూరి సీతారామరాజుగా చరణ్‌ను అద్భుతంగా ఆవిష్కరించిన రాజమౌళి.. క్లైమాక్స్‌లో ఆయనను రాముడి రూపంలో చూపించిన విధానం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు అదే దర్శకుడు 'వారణాసి'లో చరణ్‌ను హనుమంతుడి పాత్రలో చూపిస్తే అది సినిమా ప్రత్యేక ఆకర్షణగా మారుతుందని అభిమానులు భావిస్తున్నారు.



# టాక్సిక్‌ను సక్సెస్ ఫుల్‌గా తీసి చూపా

'టాక్సిక్' ప్రారంభించినప్పుడు చాలా మంది 'నీ వల్ల కాదు' అన్నారని అలాంటివాళ్లకు చిత్రం పూర్తి చేసి తన సత్తా చూపించానని దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఎమోషనల్ అయ్యారు. ఆమె దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆ ఈవెంట్‌లో దర్శకురాలు మాట్లాడుతూ.. ఈ సినిమా మొదలు పెట్టినప్పుడు చాలా మంది తనను ఎన్నో మాటలు అన్నారని గుర్తుచేసుకున్నారు. తనపై నమ్మకం ఉంచి.. ఈ సినిమాను అంగీకరించినందుకు యశ్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.

# అభిమానికి చిరంజీవి అభినందనలు

మెగాస్టార్ చిరంజీవికి తన అభిమానులంటే ఎంతటి ప్రేమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అభిమానులనే తన కుటుంబంగా భావించే ఆయన.. అవకాశం వచ్చిన ప్రతిసారీ వారి పట్ల తనకున్న ఆప్యాయతను చాటుకుంటూనే ఉంటారు. తాజాగా 'మెగా 158' షూటింగ్ సెట్స్‌లో జరిగిన ఓ అరుదైన, హృదయాన్ని హత్తుకునే సంఘటన ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. 'మెగా 158' షూటింగ్ సమయంలో కెమెరా విభాగంలో పనిచేస్తున్న నివాస్ అనే టెక్నీషియన్ మెగాస్టార్ చిరంజీవి దృష్టిని ఆకర్షించాడు. ఆయన పనితీరును గమనించిన చిరంజీవి.. నివాస్‌తో సరదాగా మాట్లాడారు. ఈ సందర్భంగా అతడి వ్యక్తిగత విషయాలను అడిగి తెలుసుకున్నారు. అప్పుడు నివాస్ తాను రామ్ చరణ్‌కు వీరాభిమానినని చెప్పడంతో పాటు.. చరణ్‌పై ఉన్న అభిమానంతో తన కుమారుడికి 'జస్వంత్ రావ్ చరణ్' అనే పేరు పెట్టినట్లు చిరంజీవికి తెలిపారు. అంతటితో ఆగకుండా చిరంజీవి నివాస్ కుటుంబాన్ని తన ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. మెగాస్టార్ నుంచి వచ్చిన ఈ ఆహ్వానం ఆ కుటుంబానికి ఊహించని ఆనందాన్ని కలిగించింది. చిరంజీవి ఆహ్వానం మేరకు నివాస్ తన కుటుంబంతో కలిసి ఆయన ఇంటికి వెళ్లారు. అక్కడ వారికి మరో మధురమైన సర్‌ప్రైజ్ ఎదురైంది. మెగాస్టార్‌తో పాటు మెగా పవర్ స్టార్ రావ్ చరణ్ డా నివాస్ కుటుంబ సభ్యులతో కొంత సమయం గడిపారు. చిన్నారి జస్వంత్ రావ్ చరణ్‌తో చరణ్ ఆప్యాయంగా మాట్లాడారు. నివాస్ కుటుంబ సభ్యులతో చిరునవ్వులు చిందిస్తూ ఫొటోలు దిగారు. మెగా ఫ్యామిలీతో గడిపిన ఈ అరుదైన క్షణాలు ఆ అభిమాని కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా మారాయి. ఓ సాధారణ టెక్నీషియన్ కుటుంబానికి చిరంజీవి, రావ్ చరణ్ ఇచ్చిన గౌరవం, చూపించిన ఆత్మీయత ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఇంద్రపుత్రగా కిరణ్ అబ్బవరం

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ఇటీవల ఆయన నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద డా సత్తా చాటుతోంది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కిరణ్.. మరోవైపు భారీ స్థాయిలో తెరకెక్కనున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు



సిద్ధమవుతున్నారు. ఇప్పటి కిరణ్ అబ్బవరం ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఓ భారీ బ్జడెట్ మైథలాజికల్ సినిమాలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఆసక్తిని పెంచింది. పేరు చూస్తేనే ఇది పురాణ, ఇతిహాస నేపథ్యంతో రూపొందనున్న భారీ చిత్రమనే విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాతో శ్రీకాంత్ పుప్పాల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆయన గతంలో 'కాంతార చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని ఇప్పుడు తన తొలి దర్శకత్వ చిత్రానికి ఉపయోగించుకోనున్నారు.

# కపాలిలో హన్సిక ఫస్ట్ లుక్ విడుదల



నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రావ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటి ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత ్యరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు డా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ డా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' వలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో డిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాల పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజువల్‌గా డా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

# గ్లామర్ విషయంలో హద్దులు దాటను



కోలీవుడ్ యంగ్ బ్యూటీ దర్శా గుప్తా బుల్లితెర సీరియల్స్ ద్వారా నటిగా కెరీర్ ప్రారంభించి, తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సినిమాలపై ఉన్న ఆసక్తితో 'రుద్ర తాండవం' అనే యాక్షన్ థ్రిల్లర్‌తో వెండితెరకు పరిచయమైన ఆమె.. ఆ తర్వాత 'ఓమై గోస్ట్' చిత్రంతో మరింత గుర్తింపు సంపాదించుకున్నారు. ప్రస్తుతం యోగిబాబు సరసన 'మెడికల్ మిరాకిల్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. పొలిటికల్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. నటనతో పాటు సోషల్ మీడియాలోనూ దర్శా గుప్తా చాలా యాక్టివ్‌గా ఉంటారు. తరచూ తన గ్లామర్ ఫొటోలు, వ్యక్తిగత విషయాలను అభిమానులతో పంచుకుంటూ సందడి చేస్తుంటారు. అయితే ఆమె పోస్ట్ చేసిన కొన్ని ఫొటోలు వైరల్ కావడంతో.. గ్లామర్ విషయంలో హద్దులు దాటుతున్నారంటూ కొందరు నెటిజన్లు విమర్శలు చేశారు. తాజాగా ఈ విమర్శలపై దర్శా గుప్తా స్పందిస్తూ నెటిజన్లకు గట్టి కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియాలో తనను అనుసరించే అభిమానులను తాను సొంత కుటుంబ సభ్యుల్లా భావిస్తానని ఆమె చెప్పారు. తన పుట్టినరోజు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో అభిమానులు శుభాకాంక్షలు చెప్పడం, తనతో నేరుగా మాట్లాడటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. అభిమానులతో ఈ అనుబంధాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతోనే తాను సోషల్ మీడియాలోకి వచ్చానని, మురుగన్ స్వామి సాక్షిగా చెబుతున్నానని పేర్కొన్నారు. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలపై కూడా దర్శా గుప్తా స్పష్టత ఇచ్చారు. ఈ ప్రపంచంలో తన వెనుక ఏం జరుగుతుందో తనకు తెలియకపోయినా.. తన తల్లి నేర్పిన పద్ధతులు, విలువలను పాటిస్తూ జీవిస్తున్నానని చెప్పారు. తాను సెక్సీ ఫొటోలు పోస్ట్ చేయవచ్చని, అందులో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని.. అయితే తనకు కొన్ని స్పష్టమైన హద్దులు ఉన్నాయని వెల్లడించారు. ఎంత డబ్బు, పేరు, కీర్తి వచ్చినా ఆ హద్దులను మాత్రం ఎప్పటికీ దాటబోనని తేల్చిచెప్పారు. తన ఫొటోలపై ఎవరైనా విమర్శలు చేసినంత మాత్రాన తాను బాధపడనని, తనకు ఏది సరైనదో తనకు తెలుసని అన్నారు. దీంతో దర్శా గుప్తా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# సంక్రాంతి బరిలో 'సంబరాల ఏటి గట్టు'!



సాయి ధరమ్ తేజ్ కెరీర్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'సంబరాల ఏటి గట్టు'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రోహిత్ కేపీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కే. నిరంజన్ రెడ్డి రూ.120 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. గతంలో ఇదే బ్యానర్‌లో తెరకెక్కిన 'హనుమాన్' చిత్రం జనవరి 12న విడుదలై ఘనవిజయం సాధించిన నేపథ్యంలో అదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ 'సంబరాల ఏటి గట్టు'ను కూడా 2027 జనవరి 12న పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సాయి ధరమ్ తేజ్ సంక్రాంతి బరిలో తన ప్రతిష్ఠాత్మక చిత్రంతో సందడి చేయబోతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్నారు. తొలుత 2026 డిసెంబర్‌లో చిత్రాన్ని విడుదల చేయాలని భావించినప్పటికీ, సంక్రాంతి సీజన్‌లో విడుదల చేస్తే మరింత అనుకూలంగా ఉంటుందని మేకర్స్ నిర్ణయించినట్లు సమాచారం. అయితే జనవరి 12, 2027 విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.